RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 184 బుధవారం 30 జూలై 2025 పేజీలు : 4

### ఆస్ట్రేలియా విద్యార్థి వీసా నిబంధనలు కఠినతరం

న్యూఢిల్లీ : వివిధ దేశాల్లో విదేశీ విద్యార్థులకు నిర్దేశించిన నిబంధనల్లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఆయా దేశాల్లో వివిధ విశ్వవిద్యాలయాల క్యాంప్‌సల ఎంపికను ఈ మార్పులు ప్రభావితం చేస్తాయి. ఈ మధ్య కాలంలో ఆస్ట్రేలియాను ఎంపిక చేసుకొనే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. 2004లో 1,18,109 మంది విద్యార్థులు ఆస్ట్రేలియాలోని పలు విశ్వవిద్యాలయాలను ఎంపిక చేసుకొన్నారు. తమ విద్యార్థి వీసా నిబంధనల్లో పేర్కొనదగ్గ మార్పులను చేయనున్నట్లు గత ఏడాది ఆస్ట్రేలియా ప్రకటించింది. ఇప్పటి వరకూ ఆ దేశానికి వెళ్లే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి లేదు. తాజాగా పరిమితి విధించాలని నిర్ణయించినట్లు సమాచారం.

## పాకిస్థాన్‌ను కాపాడితే... కాంగ్రెస్‌కు ఏం వస్తుంది..?




## ఉగ్రవాదులను చంపితే...

## విపక్షాలకు సంతోషమే లేదేమి?

లోక్‌సభలో రెండోరోజు ఆపరేషన్ సిందూర్ పై ప్రత్యేక చర్చ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ విపక్షాలపై ఫైర్ అయ్యారు. మాజీ హోం మంత్రి, కాంగ్రెస్ నేత చిదంబరం మాట్లాడుతూ.. ఈ ఉగ్రవాదులు పాకిస్థాన్ నుండి వచ్చారనడానికి రుజువు ఏమిటి అని ప్రశ్నించడం నాకు చాలా బాధగా అనిపించింది. ఆయన ఏం చెప్పాలనుకుంటున్నారు..? ఎవరిని కాపాడాలనుకుంటు న్నారు..? పాకిస్థాన్ కు మద్దతుగా మాట్లాడుతున్నారా..? పాకిస్థాన్‌ను కాపాడటం ద్వారా మీరు (కాంగ్రెస్) ఏం పొందాతారు..? అంటూ అమిత్ షా ఫైర్ అయ్యారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా మాట్లాడటం తగదని అన్నారు. జమ్మూకశ్మీర్ లో సోమవారం జరిగిన ఆపరేషన్ మహాదేవ్‌లో పహల్గాం దాడితో సంబంధం ఉన్న ముగ్గురు ఉగ్రవాదులను సైనిక దళాలు మట్టుపెట్టాయి.

ఆ అంశంపై పార్లమెంట్ లో అమిత్ షా మాట్లాడుతూ.. ఆపరేషన్ మహాదేవ్ ద్వారా పహల్గాం అనుమాష ఘటనకు సంబంధించి ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారని ప్రకటిం చారు. కీలక నిందితుడు సులేమాన్ ను హతమార్చామని, అలాగే వారు పాకిస్థాన్ నుంచే వచ్చారనేందుకు తమ ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఉగ్రవాదులు చనిపోయారన్న సంతోషం కూడా విపక్షాలకు లేదు. ఉగ్రవాదులను అంతమొం దించామని చెప్పగానే విపక్షాలు ఆనందం వ్యక్తం చేస్తాయను కున్నా.. కానీ, విపక్షాలు సందేహాలను వ్యక్తం చేస్తున్నాయి.

హతమైన ముగ్గురు ఉగ్రవాదులు పాక్‌కు చెందినవారేనని ఆధారాలున్నాయి. ఉగ్రవాదుల నుంచి పాకిస్థాన్ కు సంబంధిం చిన పత్రాలు, పాక్ చాకెట్లు స్వాధీనం చేసుకున్నామని అమిత్ షా స్పష్టం చేశారు. ఏప్రిల్ 30న సీసీఎస్ సమావేశం జరిగింది, దీనిలో భద్రతా దళాలకు పూర్తి కార్యాచరణ, స్వేచ్ఛ ఇవ్వడం జరిగింది. ఆపరేషన్ సింధూర్ మే 7న ప్రారంభమైంది. తెల్లవారుజామున 1:04 నుండి 1:24 గంటల మధ్య జరిగింది. ఈ ఆపరేషన్‌లో, పాకిస్తాన్‌కు చెందిన తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడిలో ఏ పాకిస్తానీ పౌరుడు కూడా మరణించలేదని అమిత్ షా చెప్పారు. ఉగ్రవాదులతో తమకు ఎలాంటి సంబంధం లేదని పాకిస్తాన్ ప్రపంచానికి చెబుతోంది. కానీ, ఆపరేషన్ సిందూర్ రెండవ రోజు పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల అంత్యక్రియల ఊరేగింపు జరిగింది.

పాకిస్తాన్ సైన్యం, పోలీసు అధికారులు అందులో పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్‌ను బయటపెట్టిందని అమిత్ షా అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ డీజీఎంఓ మాకు ఫోన్ చేశారు. ఆ తరువాత మేము యుద్ధాన్ని ఆపామని పార్లమెంట్ లో అమిత్ షా స్పష్టం చేశారు.




## వినే ధైర్యం లేకుంటే ఆ పదవికి అర్హులు కారు..

## మోదీపై ఖర్గే విమర్శలు

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై ఉభయసభల్లో చర్చ జరుగుతుండగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభలో లేకపోవడాన్ని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే తప్పుపట్టారు. తామంతా అఖిల పక్ష సమావేశంలో పాల్గొంటే ఆయన బీహార్‌లో రాజకీయ ర్యాలీలో పాల్గొన్నారని అన్నారు. 'మీరు ఏదో సభలో ఇక్కడ ఉండాల్సింది. వినేందుకు మీకు ధైర్యం లేకపోతే మీరు ఆ పదవిలో ఉండటానికి అర్హులు కారు' అని ఖర్గే విమర్శించారు. ఆపరేషన్ సింధూర్, పహల్గాం ఉగ్రదాడిపై రాజ్యసభలో మంగళవారంనాడు ప్రారంభమైన ప్రత్యేక చర్చిలో ఖర్గే మాట్లాడారు. భద్రతా లోపాల కారణంగానే పహల్గాం ఉగ్రగాడి ఘటన జరిగిందని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ఖర్గే ప్రశ్నించారు. హోం మంత్రి అమిత్‌షా ఇందుకు బాధ్యత వహించాలన్నారు. దేశంలో టెర్రర్ ఇన్‌ఫ్రా నడ్డివిరిగిందని కేంద్రం చెబుతున్నప్పుడు పహల్గాం ఉగ్రదాడి ఎలా జరిగిందని నిలదీశారు. పహల్గాం ఉగ్రదాడిని నిలువరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు తన సంతాపం తెలియజేస్తున్నానని అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో జాతీయ భద్రత విషయంలో సాధించిన విజయాలను తక్కువ చేసి చూపిస్తూ బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఖర్గే విమర్శించారు. కాంగ్రెస్ ఆయుధాల ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తే వాళ్లు అబద్ధాల ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. విపక్షాలు పాకిస్థాన్‌కు మద్దతిస్తున్నాయంటూ ఆసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి అసత్యాలతో ప్రజలను ఎక్కువకాలం మభ్యపెట్టలేరని, తామెప్పుడూ పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వలేదని, ఇచ్చే ప్రసక్తే కూడా లేదని స్పష్టం చేశారు.




న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి మానవత్వం చాటుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో పాకిస్తాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో తల్లిదండ్రులను కోల్పోయిన 22 మంది పిల్లలను దత్తత తీసుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేత నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, జమ్మూ కాశ్మీర్?లోని పహల్గాంలో 2025, ఏప్రిల్ 22న ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ టెర్రర్ ఎటాక్?లో 26 మంది టూరిస్టులు చనిపోయారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాకిస్థా, పీవోకేలోని ఉగ్రవాద స్థావరాలపై మెరుపు దాడులు చేసింది. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి జమ్మూ కాశ్మీర్‌లోని ఎల్ఓసీ వెంబడి అనేక సెక్టార్లలో సాధారణ పౌరులే లక్ష్యంగా పాకిస్తాన్ సైన్యం భారీ షెల్లింగ్‌కు పాల్పడింది. వెంటనే అప్రమత్తమైన భారత సైనం పాక్ కాల్పులను తిప్పికొట్టినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. పాక్ సైన్యం కాల్పుల్లో చాలా మంది ప్రజలు చనిపోయారు. ఈ ఘటన అనంతరం మే నెలలో రాహుల్ గాంధీ జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్‌లో పర్యటించి పాక్ సైనికుల కాల్పుల్లో మరణించిన కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే పాక్ సైనికుల షెల్లింగ్‌లో ప్రాణాలు కోల్పోయిన 22 మంది పిల్లలను రాహుల్ గాంధీ దత్తత తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. వారి బాగోగులను మొత్తం ఇకపై ఆయన చూసుకోనున్నారు.

## కేటీఆర్ కోసం కేసీఆర్ మౌనవ్యూహం! కవిత సంగతి ఏంటో?



తెలంగాణలోని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. పార్టీపై పట్టు కోసం అధినేత కేసీఆర్ కుమారుడు, కుమార్తె మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోంది. అయితే ఈ విషయంపై అధినేత కేసీఆర్ వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నట్లు చెబుతున్నారు. కానీ, పరిస్థితులను గమనిస్తే కుమారుడు కేటీఆర్ కి పగ్గాలు అప్పగించడానికే ఆయన ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారని అంటున్నారు. తాజా రాజకీయాలు ఇవే సంకేతాలిస్తున్నట్లు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్సెస్ కేటీఆర్ అన్నట్లుగా రాజకీయం మారుతోందని అంటున్నారు. కేసీఆర్ కూడా సరిగ్గా ఇదే ఆశిస్తున్నారని చెబుతున్నారు. పార్టీపై కేటీఆర్ పూర్తి పట్టు సాధించేలా కేసీఆర్ దారులు చూపుతున్నారని అంటున్నారు. అందుకే రాజకీయంగా కీలక అంశాలపై కూడా ఆయన మాట్లాడటం లేదంటున్నారు. ఇటీవల బీఆర్ఎస్ రాజకీయంగా చాలా ప్రాధాన్యతాంశంగా తీసుకున్న 'బనకచర్ల'పై కూడా అధినేత మాట్లాడకపోవడాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. సహజంగా ప్రభుత్వాన్ని రాజకీయంగా ఇరుకున పెట్టేందుకు, ప్రజల్లో తెలంగాణ భావోద్వేగాన్ని తట్టి లేపెందుకు బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా ఆంధ్రాతో ముడిపడిన అంశాన్ని ఎత్తుకుంటుంది. అలాంటి అంశాన్ని హైలెట్ చేయడానికి కేసీఆర్ మీడియా ముందుకు వస్తారు. ఆయన చెబితేనే తెలంగాణ సమాజంలోకి విషయం చొచ్చుకువెళుతుందన్న విశ్లేషణలు ఉన్నాయి. కానీ, బనకచర్ల విషయంలో ఎక్కడా కేసీఆర్ మాట్లాడలేదు. కేటీఆర్ ను ముందు పెట్టి 'బనకచర్ల' డ్రామాను రక్తి కట్టించారు. ప్రభుత్వం కూడా 'బనకచర్ల'పై బీఆర్ఎస్ దాడితో ఆత్మరక్షణలో పడినట్లు కనిపించిందని అంటున్నారు. ఇదంతా కేసీఆర్ వ్యూహంగా చెబుతున్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీకి భావినేతగా కేటీఆర్ ను హైలెట్ చేయడానికే ఆయన వెనక్కి తగ్గారంటున్నారు. నిజానికి ఎన్నికల్లో పార్టీ ఓడిన నుంచి కేసీఆర్ ఎక్కువగా మౌనాన్ని పాటిస్తున్నారు. ఉద్యమ సమయంలో మాట్లాడినట్లు ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. ముఖ్యమంత్రి అయ్యాక అడపాదడపా మీడియాతో మాట్లాడిన కేసీఆర్, ఇప్పుడు ఎక్కువగా తన కుమారుడు కేటీఆర్ తోనే మాట్లాడిస్తున్నారు. 2023లో ముఖ్యమంత్రి పీఠం నుంచి దిగిపోయిన తర్వాత ఎర్రవల్లి ఫాం హౌజుకు వెళ్లిన కేసీఆర్.. ఒకటి రెండు సార్లు మాత్రమే రాజకీయ కార్యకలాపాలను నిర్వహించారు. పార్టీ ఎమ్మెల్యేల సమావేశం నిర్వహణకు బీఆర్ఎస్ భవన్ కు రెండుసార్లు వచ్చిన కేసీఆర్, ఏప్రిల్ లో బీఆర్ఎస్ 25 ఏళ్ల సంబురాలకు మరోసారి వరంగల్ వచ్చారు. అంతేగాని రాజకీయంగా ఆయన ఎక్కడా కనిపించడం లేదు. చివరికి అసెంబ్లీకి కూడా మార్చిలో ఒక రోజు వచ్చి వెళ్లిపోయారు. కానీ, ప్రతి రోజు కేటీఆర్ ద్వారానే బీఆర్ఎస్ ప్రకటనలు ఇప్పిస్తున్నారు. పార్టీకి సర్వం కేటీఆర్ అన్న భావన వ్యాప్తి కలిగేలా అడుగులు వేస్తున్నారని అంటున్నారు. ఇది గమనించే పార్టీలో తన పాత్రపై క్లారిటీ కోసం కవిత ఆరాటపడుతున్నారని అంటున్నారు. అయితే పార్టీకి ఎవరో ఒకరే సుప్రీం కమాండర్గా ఉంటారని అంటున్నారు. కేసీఆర్ కూడా కేటీఆర్‌కు లైన్ క్లియర్ చేసేందుకు తనతోపాటు మిగిలిన వారిని సైతం వెనక్కి తగ్గిస్తున్నారని చెబుతున్నారు.

## పేదలకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్!





## ఇళ్లకే వచ్చి రేషన్ కార్డులిస్తరు!!

హైదరాబాద్ : రాష్ట్రంలో కొత్తగా జారీ చేస్తున్న రేషన్ కార్డుదారులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు సర్కార్ సిద్ధమైంది. ప్రతి స్కీమ్‌తో పాటు ఆరోగ్య శ్రీ కింద చికిత్సకు కూడా రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో కొత్తగా కార్డులు పొందుతున్నోళ్లకు ప్రభుత్వ పథకాలు అందేలా యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తున్నది. కొత్తగా 7 లక్షల రేషన్ కార్డులు అందజేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే అమలు చేస్తున్న వివిధ గ్యారంటీలను కొత్త రేషన్ కార్డుదారులకు కూడా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మీ, చేయూత తదితర పథకాల కోసం వీళ్ల నుంచి దరఖాస్తులు తీసుకోనుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో ప్రకటించనుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ డ్రైవ్‌లో భాగంగా అధికారులే నేరుగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి.. వాళ్ల వివరాలను నమోదు చేసుకుని, అవసరమైన అనుసంధాన ప్రక్రియ పూర్తి చేస్తారు.

**కొత్త రేషన్ కార్డుదారుల నుంచి.. గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మీ, చేయూత పథకాలకు దరఖాస్తులు...** తెలంగాణలో కొత్తగా రేషన్ కార్డులు పొందిన వేలాది కుటుంబాలు ప్రస్తుతం ఒక సందిగ్ధంలో ఉన్నాయి. తమకు కొత్తగా కార్డులు వచ్చినా.. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలో.. ఎవరికి దరఖాస్తులు సమర్పించాలో తెలియక సతమతం అవుతున్నాయి. గతంలో రేషన్ కార్డులు లేని కారణంగా ఎన్నో ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉండిపోయిన వారికి.. ఇప్పుడు ఈ కొత్త కార్డులు రావడంతో ఎంతో ఉపశమనం లభించింది. ముఖ్యంగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. దాదాపు ప్రతీ పథకానికి రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటుండటంతో.. కొత్తగా కార్డులు పొందిన వారు వాటికి దరఖాస్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే.. ఈ ప్రక్రియ వారికి గందరగోళంగా మారింది. ఈ పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం.. కొత్త రేషన్ కార్డుదారుల కోసం ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని వల్ల వారికి సంక్షేమ పథకాలను మరింత సులభతరం చేయనుంది.

**ప్రత్యేక డ్రైవ్ ద్వారా దరఖాస్తులు..** రాష్ట్రంలో కొత్తగా జారీ చేస్తున్న రేషన్ కార్డుదారులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు సర్కార్ సిద్ధమైంది. ప్రతి పథకంతో పాటు.. ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్సలకు కూడా రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో.. కొత్తగా కార్డులు పొందుతున్న వారికి ప్రభుత్వ పథకాలు అందేలా ఒక సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం.. కొత్తగా దాదాపు 7 లక్షల వరకు రేషన్ కార్డులు మంజూరయ్యాని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న వివిధ గ్యారంటీ పథకాలను కొత్త రేషన్ కార్డుదారులకు కూడా అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), ఇందిరమ్మ ఇళ్లు (గృహనిర్మాణ పథకం), మహాలక్ష్మి (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.2500 ఆర్థిక సాయం), చేయూత (వృద్ధాప్య, వికలాంగ పెన్షన్లు) తదితర పథకాల కోసం ఈ కొత్త లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఈ డ్రైవ్‌లో భాగంగా.. అధికారులే నేరుగా లబ్ధిదారుల నివాసాల వద్దకు వెళ్లి, వారి వివరాలను నమోదు చేసుకుని.. అవసరమైన అనుసంధాన ప్రక్రియను పూర్తి చేస్తారు. దీనివల్ల లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే.. తమకు అర్హత ఉన్న పథకాల సేవలను పొందగలుగుతారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం త్వరలో అధికారికంగా ప్రకటించనుంది.

**లబ్ధిదారుల సంఖ్య పెరుగుదల..** గతంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 90.10 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఉండగా.. 2.84 కోట్ల మంది వివిధ పథకాల కింద లబ్ధిదారులుగా ఉన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఇప్పటివరకు కొత్తగా 3.50 లక్షలకు పైగా రేషన్ కార్డులను మంజూరు చేసింది. మొత్తంగా 7 లక్షల కుటుంబాలకు కొత్తగా కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కొత్త కార్డుల కింద 30 లక్షల మందికి పైగా లబ్ధిదారులు ఉంటారని అంచనా. ఈ లబ్ధిదారులందరినీ ప్రభుత్వ సంక్షేమ పథకాల పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం పక్కాగా ప్రణాళికలు రచిస్తోంది. ఈ కీలక నిర్ణయం వల్ల రేషన్ కార్డులు లేని కారణంగా ఇంతకాలం ప్రభుత్వ పథకాలు అందని లక్షలాది మందికి ఇప్పుడు ఆర్థిక భరోసా లభిస్తుంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది ఒక పెద్ద ఊరట అని చెప్పవచ్చు.

# సంపాదకీయం

## ఏపీ కాంగ్రెస్ కి బీసీలే దిక్కునా ?

ఏపీలో కాంగ్రెస్ పైకి లేస్తుందా అసలు లేపే ఆలోచనలు ఉన్నాయా. కాంగ్రెస్ అధినాయకత్వం మదిలో ఏముంది ఇవన్నీ ప్రశ్నలే. అంతే కాదు కాంగ్రెస్ కి ఏపీ మీద ఏ రకమైన వ్యూహాలు ఉన్నాయి. గత మూడు ఎన్నికల నుంచి డిపాజిట్లు గల్లంతు అవుతూ వస్తున్న పార్టీని దాని మానన వదిలేస్తున్నారా లేక వచ్చే ఎన్నికల నాటికి ఏమైనా పొత్తు ఆలోచనలు చేస్తున్నారా ఇవన్నీ కూడా సందేహాలే. కాంగ్రెస్ కి ఒకనాడు దన్నూ ధైర్యం ఇచ్చింది ఉమ్మడి ఏపీ. అలాంటి కంచుకోటలో ఈ రోజు కాంగ్రెస్ డీలా పడడం కాదు బేలగా మారిపోయింది.

**ఏపీలో కాంగ్రెస్ దైన్యం :** కాంగ్రెస్ వర్తమానం ఎలా ఉంది అంటే దైన్యం అని చెప్పాలనే అంటారు అంతా. గతమెంతో ఘనం అని ఒకటికి పదిసార్లు వల్లె వేసుకోవాలి తప్ప ప్రస్తుతం మాత్రం కాంగ్రెస్ తీరు చూస్తే బావురుమనాల్సి ఉందని కాంగ్రెస్ కి ఇంకా వీరాభిమానులుగా ఉన్న వారు చెప్పే మాట. దేశంలో ఎమర్జెన్సీ విధించినపుడు 1977లో మొత్తం అంతా కాంగ్రెస్ ఓడింది. కానీ 1978లో ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ని గెలిపించి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ కి ఊపిరులు అద్దిన ఘనత ఏపీ కాంగ్రెస్ కి ఉంది అలాంటి కాంగ్రెస్ ఈ రోజున ఏ తీరున పయనిస్తోంది అన్న ఆలోఅనలు ఆ పార్టీవాదులలో ఉన్నాయి.

**ఇంకా వారే మిగిలారు :** కాంగ్రెస్ పార్టీ పట్ల అభిమానం చంపుకోలేక పదవుల వెంట పడకుండా ఇంకా అనేక మంది సీనియర్లు ఆ పార్టీని అట్టిబెట్టుకుని ఉన్నారు అంటే అదే కాంగ్రెస్ సిద్ధనత బలం అని అంటారు. ఈ రోజుకీ కాకలు తీరిన సీనియర్ నేత మౌనంగా కాంగ్రెస్ లోనే ఉన్నారు. ఎప్పటికైనా హస్తరేఖలు మారకపోతాయా జాతకం తిరగబడకపోతుందా అన్నదే వారి ఆలోచన. అలా జరగాలన్నదే వారి ఆశ, ఆకాంక్ష కూడా. అయితే కాంగ్రెస్ ఎత్తిగిల్లాలంటే సరైన చర్యలు తీసుకోవాలని పార్టీని మొత్తం ప్రక్షాళన చేసి సరైన వారి చేతిలో నాయకత్వం పెట్టాలన్న డిమాండ్ అయితే వినిపిస్తూ వస్తోంది.

**హైకమాండ్ ఫోకస్ పెడుతుందా :** దేశంలో కాంగ్రెస్ మెల్లగా మెరుగుపడుతోంది. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ సెంచరీ మార్క్ దాటింది. ఆ పార్టీ మిత్రులతో కలిపి ఈ రోజు పార్లమెంట్ లో బలంగా ఉంది. రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రధాన్ ప్రతిపక్ష నాయకుడు అయ్యారు. ఇక తెలంగాణాలో పదేళ్ళ పోరాటం తరువాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కర్ణాటకలో అంతకు ముందే గెలిచింది. తమిళనాడులో డీఎంకేతో కలసి తన రాజకీయ అధికారాన్ని నిలబెట్టుకుంటోంది. కేరళలో చూస్తే వామపక్ష కూటమికి సరైన పోటీగా ఉంది. అక్కడ కాంగ్రెస్ పరిస్థితి బాగానే ఉందని చెప్పాలి. ఎటొచ్చి ఏపీలోనే కాంగ్రెస్ పాతాళం అంచులు చూస్తోంది. మరి కాంగ్రెస్ మీద జాతీయ స్థాయి పెద్దల చూపు ప్రసరించడం లేదా అన్న చర్చ అయితే గట్టిగానే జరుగుతోంది.

**సామాజిక సమీకరణలతోనే :** ఏపీలో రాజకీయం అంతా సామాజిక సమీకరణల మీదనే ఆధారపడి ఉంది. దాని ఆధారంగానే పార్టీలు కూడా ముందుకు సాగుతున్నాయి ఏపీ అంటేనే కులాల సంకుల సమరం అని చెబుతారు. దాంతో ఏపీలో ఇపుడు చూస్తే కమ్మలు టీడీపీకి రెడ్లు వైసీపీకి కట్టుబడిన సన్నివేశం కనిపిస్తోంది. అలాగే కాపులు చూస్తే పవన్ కళ్యాణ్ వైపు సాగుతున్నారు అన్నది తెలుస్తోంది. మరి ఉన్నది ఎవరు అంటే బీసీలు. రాజ్యాధికారం కోసం బీసీలు ఎప్పటి నుంచో పోరాటం చేస్తూ ఉన్నారు వారిని ముందు పెట్టి వారికి సారధ్యం అందించి కాంగ్రెస్ సాగితే ఏపీలో రాజకీయంగా సామాజికంగా ఎంతో కొంత పురోగతి కనిపిస్తుందని అంటున్నారు మరి ఆ దిశగా కాంగ్రెస్ పెద్దల అలోచనలు ఉంటాయా అన్నదే చర్చగా ఉంది.

**కూటమి వర్సెస్ వైసీపీ :** ఏపీలో చూస్తే కూటమి అధికారంలో ఉంది. వైసీపీ ప్రతిపక్షంలో ఉంది. దాంతో కూటమి వైసీపీల మధ్య రాజకీయ సమరం సాగుతోంది. కాంగ్రెస్ పాత్ర ఈ నేపథ్యంలో ఎంత అన్నది చర్చగా ఉంది. దాంతో కాంగ్రెస్ తాను రేసులో నిలబడాలి అంటే ఎలాంటి మొహమాటాలూ లేకుండా అధికార టీడీపీ కూటమి మీద సమర శంఖం పూరించాలి. అదే సమయంలో వైసీపీని కూడా ధీటుగా ఎదుర్కోవాలి. అపుడే జాతీయ పార్టీగా కాంగ్రెస్ ఏపీ రాజకీయ తెర మీద కనిపిస్తుంది అని అంటున్నారు. చూడాలి మరి హైకమాండ్ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటుందా అన్నది.

## ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలి...

### అలియాబాద్ కమిషనర్ చంద్రశేఖర్

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి అలియాబాద్ మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి...



శామీర్పేట (గరుడ వార్త) : ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అలియాబాద్ కమిషనర్ చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు.

మెడిసిటీ హాస్పిటల్ వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని అవసరమైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అలియాబాద్ మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి కోరారు. మంగళవారం అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ సందర్భంగా వైద్యులు ప్రీతి సారిక దీప్తి తదితర వైద్యులు వైద్య సిబ్బంది ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, వారిలో కొందరికి మందులు సైతం అందించారు. బి రామ్ రెడ్డి కే లింగం ఎన్ బాలేష్ జి నాగమల్లారెడ్డి బి నాగరాజ్ పాల్గొన్నారు.

## క్రీడలు మంచి భవిష్యత్తుకు బాటలు : ఆర్టిఏ సభ్యుడు జైపాల్ రెడ్డి



శామీర్ పేట, (గరుడ వార్త) : క్రీడలు మంచి భవిష్యత్తుకు బాటలో ఉంటివని ఆర్టిఏ సభ్యుడు జైపాల్ రెడ్డి అన్నారు. శామీర్ పేట మండలం హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ లో మేడ్చల్ జిల్లా ఆర్టిఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలంటే క్రీడల పై మక్కువ పెంచుకోవాలని, ఎంచుకున్న క్రీడల్లో తగిన శిక్షణ పొందుతు ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థి దశ ఇందుకు ఎంతో ముఖ్యమని తెలిపారు. అనంతరం ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా స్థాయి అండర్ 8,10,12,14,16,18,20, బాల, బాలికలకు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నట్లు తెలిపారు. వివిధ పాఠశాలలు, కళాశాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారని, ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు చెప్పారు. 3, 4 తేదీలలో హనుమకొండలో జరిగే 14వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో మేడ్చల్ జిల్లా తరపున ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను ఎంపిక చేయటం జరుగుతుందని తెలియజేశారు. అదే విధంగా 7వ తేదీన జనగామలో జరిగే రాష్ట్రస్థాయి జావలిన్ త్రూటీలలో విద్యార్థులను ఎంపిక చేయటం జరుగుతుందని చెప్పారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి తమ పాఠశాలకు మేడ్చల్ జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని, మున్ముందు క్రీడాకారులు ఉత్తమ శిక్షణలో ముందుకు సాగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా జాయింట్ సెక్రటరీ రాజు, వైస్ ప్రెసిడెంట్ అశోక్, టెక్నికల్ కమిటీ సభ్యులు శేఖర్, సునీల్, మల్లికార్జున్, భద్రం, మణికంఠ, హర్ష, స్పోర్ట్స్ స్కూల్ బీడీలు గోపాల్, ప్రభాకర్, శంకర్, క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు, వివిధ పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ అన్నప్రసాద వితరణ





శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయం వద్ద శామీర్ పేట గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా కుంట కోటిరెడ్డి- అంజమ్మ దంపతులు, కుంట సుధాకర్ రెడ్డి- శ్రావణి దంపతులు, కుంట వేద సీత, హిమశ్రీ లు క్వింటాల్ బియ్యం అందజేశారు. అలాగే కవటం జైపాల్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు రూ. 6 వేలు అందజేశారు. అలాగే దుండికూరి వెంకన్న బాబు - సాయిలత దంపతులు, సాయి తేజస్వి, అలాగే పాలకుర్తి సాయికిరణ్, అలాగే మెదక్ జిల్లా రామాయన్ పేటకు చెందిన మంచికట్ల శ్రీనివాస్- శ్రీదేవి అన్నదానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## కొలతల లెక్క తేలేనా?

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించిన కొలతల పుస్తకాలు(ఎంబీ) మాయంపై ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. కొన్నేళ్లుగా ఎంబీలను ఏఈల దగ్గరే ఉండాలని కమిషనర్లు ఆదేశిస్తున్నా.. కొందరు పట్టింపు లేకుండా వ్యవహరిస్తుండటం, గుత్తేదారులే పట్టుకొని తిరుగుతుండటం, అంచనాలకు మించి రికార్డు చేయడం కొన్నేళ్లుగా చర్చనీయాంశమైంది. కిసాన్‌నగర్ మార్కెట్‌యార్డులో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ ఎంబీ పుస్తకం మాయం కావడంపై బల్దియా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తీవ్రంగా పరిగణించారు. ఈ విషయంపై మెమో, షోకాజ్ నోటీసు ఇవ్వగా సమాధానం సరైన విధంగా ఇవ్వకపోవడంతో ఏఈ గఫూర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**కొలతలపై ఫిర్యాదులు** వ్యవసాయ మార్కెట్‌లో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను రూ.4.80 కోట్లతో నిర్మించేందుకు అప్పటి ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు తయారు చేశారు. అందులో లేని పనులను జత చేశారని, అడ్డగోలుగా రాక్ కట్టింగ్, నాలుగు ఇంచుల సీసీని ఒక ఫీట్‌గా చూపించారని, స్టీల్ డిజైన్‌లో 12 మి.మీ వాడి దానిని 16 మి.మీగా నమోదు చేశారని ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయంపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు రావడంతో అప్పటి అధికారులు విచారణకు ఆదేశించారు. మాజీ కార్పొరేటర్లు బండారి వేణు, ఎం.చంద్రశేఖర్ కమిషనర్‌తోపాటు ఏసీబీ, విజిలెన్స్, సీడీఎంఏ, కలెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీలకు ఫిర్యాదు చేశారు.

**అంచనాలకు మించి..**

నగరంలో కొన్ని అభివృద్ధి పనుల్లో అంచనాలకు మించి బిల్లులు రికార్డు చేశారనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఓ జంక్షన్‌కు చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని మళ్లీ ఎంబీ రికార్డు చేయడంతో అధికారులు కంగుతిన్నారు. దాంతో దానిని పక్కన పెట్టేశారు. పనులు పూర్తయిన తర్వాత బిల్లులు అందుకున్నా ఎంబీ ఎందుకు మూసి వేయడంలేదని మాజీ కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు.

**రికవరీ జరిగేనా?**

కిసాన్‌నగర్ సమీకృత మార్కెట్ నిర్మాణ పనుల ఎంబీ మాయం కావడంతో దానికి సంబంధించిన కొలతలు ఏవిధంగా తీసుకొని లెక్క తేల్చుతారో అధికారులకే తెలియాలి. ఏఈ కొలతల పుస్తకం గుత్తేదారు చేతిలో పెట్టారని, తిరిగి తీసుకోకుండా పోగొట్టారంటూ చర్యలు తీసుకున్నారు. అయితే ఇక్కడితోనే సరి పెడతారా? నిధుల దుర్వినియోగంపై తిరిగి కొలతలు నిర్వహించి రికవరీ చేస్తారా? అనే విషయంలో ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాల్సిందే.

## సహకారంలో.. బంగారం..!

నల్గొండ : బంగాం తాకట్టు రుణాల్లో నల్గొండ డీసీసీబీ (జిల్లా కేంద్ర సహకార బ్యాంకు) రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో మొత్తం 9 డీసీసీబీలు ఉండగా.. గతేడాది మన బ్యాంకు నాలుగో స్థానంలో ఉంది. ఈసారి రెండు స్థానాలు ఎగబాకింది. మొదటి స్థానంలో ఖమ్మం ఉంది. ఈ బ్యాంకుల్లో రైతులతో పాటు వివిధ వర్గాలకు చెందిన ఖాతాదారులున్నారు. కొన్ని నెలలుగా బంగారం తాకట్టు రుణాలపై బ్యాంకు అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పది నిమిషాల్లోనే రుణం మంజూరు చేస్తామని ప్రకటించి దాన్ని పక్కాగా అమలు చేశారు. దీంతో డీసీసీబీ పరిధిలోని శాఖల్లో అనేక మంది రుణాలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. నిబంధనలు సరళంగా ఉండటం, వెళ్లగానే జాప్యం లేకుండా మంజూరు చేయడం, బకాయిలు



చెల్లించిన వెంటనే ఆభరణాలను విడుదల చేయడం వల్ల రుణాలు తీసుకునే వారి సంఖ్య పెరిగింది. దీంతో పాటు దీర్ఘకాలిక, పంటరుణాలు ఏడాది పొడవునా ఎప్పుడైనా ఇస్తున్నారు.

ఇప్పటి వరకు 50,210 మంది రైతులకు రూ.710 కోట్ల రుణాలు మంజూరు చేశారు. వీటి వల్ల ఏడాదికి సుమారు రూ.4 కోట్ల వడ్డీ ఆదాయం రానుంది.

**సమష్టి కృషితోనే సాధ్యం**

బంగారు రుణాలు ఇవ్వడంలో రాష్ట్రంలో రెండో స్థానంలో ఉండటం ఆనందంగా ఉంది. బ్యాంకులో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, పాలకవర్గం సమష్టి కృషి వల్లే ఇది సాధ్యమైంది. గతేడాది రూ.325 కోట్ల బంగారు రుణాలు ఇవ్వగా.. ఈ ఏడాది రూ.715 కోట్లు ఇచ్చాం. కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్, నల్గొండ.

## లక్ష్యానికి మించి.. బొగ్గు ఉత్పత్తి!

కొత్తగూడెం : అడపాదడపా వర్షాలు కురిసినప్పటికీ జూన్ నెల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి సింగరేణి సంస్థ చేరువైంది. సింగరేణి వ్యాప్తంగా ఐదు ఏరియాలు ఈ ఘనతను అధిగమించగా అందులో మూడు ప్రాంతాలు ఖమ్మం, భద్రాద్రి జిల్లాలోనివి కావటం గమనార్హం.

**ఐదింట్లో మూడు మనవే..**

జూన్‌లో 49,56,235 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని సింగరేణి లక్ష్యం నిర్దేశించుకోగా 49,43,687 టన్నుల బొగ్గును వెలికితీసింది. సింగరేణి వ్యాప్తంగా ఐదు ఏరియాలు నూరుశాతానికిపైగా బొగ్గు ఉత్పత్తి చేశాయి. వీటిలో కొత్తగూడెం ఏరియా-109%, మణుగూరు ఏరియా-105%, ఇల్లెందు ఏరియా-103% బొగ్గును వెలికితీశాయి. రామగుండం2 ఏరియా 139 శాతంతో అగ్రభాగాన నిలిచింది. బెల్లంపల్లి ఏరియా 129 శాతం బొగ్గును వెలికితీసింది. రామగుండం1 ఏరియా-94%, శ్రీరాంపూర్ ఏరియా-89%, రామగుండం3



ఏరియా-84%, భూపాలపల్లి ఏరియా 79%, మందమర్రి ఏరియా 68% బొగ్గును ఉత్పత్తి చేశాయి. అత్యల్పంగా అడ్రియాల ప్రాజెక్టు కేవలం 13 శాతం బొగ్గు ఉత్పత్తికే పరిమితమైంది. 'రానున్న రెండు, మూడునెలల్లో వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగే ఆస్కారముంది. వర్షాకాలంలో కోల్ బెంచ్‌లను ఏవిధంగా నిర్వహించాలనే అంశంపై ఏరియా జీఎంలకు ఇదివరకే సూచనలు ఇచ్చాం. పని ప్రదేశంలో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపాం. బొగ్గు ఉత్పత్తికి సాధ్యమైనంత తక్కువ విఘాతం కలిగేలా చూసుకోవాలని ఆదేశించాం' అని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం తెలిపారు.

## జూనియర్ కళాశాలలకు మహర్దశ

చేగుంట : రాష్ట్రంలో జూనియర్ కళాశాలలను పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటివరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిధుల కేటాయింపు అంతంతే ఉండేది. విద్యార్థుల ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ముందుకొచ్చింది. ఏళ్ల తర్వాత భారీ మొత్తంలో నిధులను ఇంటర్ విద్యాశాఖ మంజూరు చేయడం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా 326 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.56.16 కోట్లు మంజూరు చేసింది. ఇందులో మెదక్ జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా రూ.3,26,80,000 కేటాయించారు. జిల్లాలో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, నార్సింగి, శివ్వంపేట కళాశాలలకు పక్కా భవనాలు లేకపోవడంతో కేటాయించలేదు.

**మూడు నెలల క్రితం..**

కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు మూడు నెలల క్రితం ప్రతిపాదనలు పంపించారు. ఆ దస్త్రానికి తాజాగా ఆమోద ముద్ర పడింది. పదేళ్ల క్రితం వరకు ఎన్ఆర్డీపీ కింద ఏటా నిధులు మంజూరు చేశారు. అవి ఆగిపోవడంతో ప్రిన్సిపళ్లు,అధ్యాపకులు సొంతంగా ఖర్చు పెట్టడంతో పాటు దాతల సహకారంతో వివిధ పనులు చేయించారు. ఈ క్రమంలో ప్రభుత్వ కళాశాలల్లో సౌకర్యాలు ఉండవన్న భావన నెలకొంది. ఇక ఆ సమస్యలకు పరిష్కారం దొరికే అవకాశం ఉంది.

**వసతుల కల్పనకు..**

విద్యుదీకరణ, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఫర్నిచర్, బోరు బావితో పాటు ఇతర వసతులు కల్పించనున్నారు. వచ్చే నిధులతో అవసరమైన మరమ్మతులు చేపట్టనున్నారు. జిల్లాలో పక్కా భవనాలున్న వాటికి ప్రయోజనం చేకూరనుంది. జిల్లాలో అత్యధికంగా పాపన్నపేట - రూ.35.50 లక్షలు, చేగుంట- రూ.32 లక్షలు మంజూరయ్యాయి. అత్యల్పంగా మెదక్ బాలికల జూ. కళాశాలకు రూ.11 లక్షలు కేటాయించారు.

# క్షణం దాటినా బాదుడే

హైదరాబాద్ : శంషాబాద్ విమానాశ్రయంలో ర్యాంప్ పార్కింగ్ పేరుతో నిర్వాహకులు దోపిడీ చేస్తున్నారు. నిష్క్రమణల విభాగం ర్యాంప్‌లోకి కారు ప్రవేశించినప్పటి నుంచి ప్రయాణికులను వదిలి బయటకు వచ్చేసరికి 8 నిమిషాలు మాత్రమే ఉండాలి. ఒక్క క్షణం దాటినా రూ.250 పార్కింగ్ రుసుం చెల్లించాలి. బయటకు వెళ్లేప్పుడు కార్ల కారణంగా ట్రాఫిక్‌జాం అవుతున్నా అక్కడున్న వారు క్లియర్ చేయడం లేదు. దీంతో సమయం దాటితో ముక్కుపిండి మరీ రుసుం వసూలు చేస్తున్నారు. దిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై విమానాశ్రయాల్లో ఉచిత ర్యాంప్ పార్కింగ్ వ్యవధి పది నిమిషాలు ఉంది. నాలుగే కౌంటర్లు.. రుసుం వసూలు కోసం నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశారు. నిష్క్రమణలు(డిపార్చర్) ఆగమనాల (అరైవల్స్) నుంచి వచ్చే వాహనాలన్నీ బయటకు వెళ్లే టోల్‌బూత్ కౌంటర్ల వద్దకు వస్తున్నాయి. రద్దీ సమయాల్లో ఒక్కోసారి బారులు తీరుతున్నాయి. దీంతో నాలుగు కౌంటర్లున్నా.. వాహనాల రద్దీతో నెమ్మదిస్తున్నాయి. ఒక్కోసారి ఒకటి, రెండు నిమిషాలు ఆగిపోతున్నాయి.

**8 నిమిషాల్లోపు వచ్చాం..** రూ.250 రుసుం ఎందుకు చెల్లించాలని టోల్‌బూత్ వద్ద ప్రశ్నిస్తే... అక్కడున్న సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారు. పార్కింగ్ ఫీజు ఇస్తేనే బయటకు పంపుతాం.. వాదిస్తే మరో రూ.250 పెనాల్టీ కట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

**ప్రయాణికుల భద్రతకు శ్రమిస్తున్నాం**



ప్రయాణికులు, సందర్శకుల భద్రతకు శ్రమిస్తున్నామని శంషాబాద్ విమానాశ్రయ అధికారులు తెలిపారు. టెర్మినల్ ముందుభాగం హై సెక్యూరిటీ జోన్ అని.. అందుకే ఎక్కువసేపు వాహనాలు ఉండకుండా పంపుతున్నామన్నారు. ర్యాంప్ పార్కింగ్‌పై 8 నిమిషాలు ఉచితంగా ఉండటమంటే ఆగమనాల నుంచి వచ్చిన వారిని వాహనాల్లో ఎక్కించుకోవడం, నిష్క్రమణల విభాగంలో ప్రయాణికులను వదిలిపెట్టడుకు మాత్రమే పరిమితమని పేర్కొన్నారు. సమయం దాటితే నామమాత్రంగా రుసుం వసూలు చేస్తున్నామని, ఈ విధానం రద్దీ సమయాల్లో ఆలస్యంగా వాహనాలు వెళ్లకుండా ఉపకరిస్తుందని వివరించారు.

రుసుములు ఇలా...

8 నిమిషాల వరకు ఉచితం

8 నుంచి 10 నిమిషాల వరకు రూ.250

10 నుంచి 15 నిమిషాల వరకు రూ.500

15 నిమిషాలు దాటితే.. వాహనాన్ని క్రేన్‌తో తీసుకెళ్తారు.

# అనువైన నగరం.. పంచింది మమకారం

హైదరాబాద్ : ఉన్నత విద్య అభ్యసించడానికి భారత్ నుంచి అనేక దేశాలకు వెళ్తుంటారు. కానీ హైదరాబాద్‌లో చదువుకోవడానికి విదేశాల నుంచి ఎంతోమంది విద్యార్థులు వస్తున్నారు. స్థానిక ప్రజలతో మమేకమైపోతున్నారు. స్నేహితులను పెంచుకుంటూ, పండగల్లో పాల్గొంటూ నగరంపై మమకారం పెంచుకుంటున్నారు. ప్రధానంగా హెచ్‌సీయూ, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ), ఓయూ, ఇతర ప్రైవేటు వర్సిటీల్లో ఎక్కువగా విదేశీ విద్యార్థులు చేరుతున్నారు. ఎస్-1, ఎస్-5 స్టడీ వీసాలు పొంది ఇక్కడికి వస్తున్నారు. సొంతంగా ఖర్చు పెట్టుకుని కొందరు.. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్ (ఐసీసీఆర్) ఉపకార వేతనాలతో మరికొందరు చదువుతున్నారు.

**నాణ్యమైన చదువు.. ఫీజు తక్కువ**

హైదరాబాద్‌లో తక్కువ ఫీజుతో నాణ్యమైన చదువు లభిస్తోంది. 46 దేశాల నుంచి విద్యార్థులు ఇక్కడికి వస్తుంటారు. ప్రధానంగా సోమాలియా, దక్షిణాఫ్రికా, దక్షిణ సూడాన్, ఆఫ్ఘనిస్థాన్ వారున్నారు. నగర వంటకాల్లో కారం ఎక్కువని, తాము హాస్టళ్లలో నచ్చిన వంటలు చేసుకుంటామని విదేశీ విద్యార్థులు చెబుతున్నారు.

**ఆర్ట్స్ కోర్సులపై మక్కువ**

విదేశీ విద్యార్థులు ఎక్కువగా ఆర్ట్స్ కోర్సులపై మక్కువ చూపిస్తున్నారు. యూజీ, పీజీ, పీహెచ్‌డీ చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు. టీచింగ్, బ్యాంకింగ్, సైన్సు ల్యాబ్స్ నెలకొల్పడంతోపాటు ఆయా దేశాల్లోని ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం పొందుతున్నారు.

**సినిమాలతో కాలక్షేపం**



కొత్తలో తమను వింతగా చూసినా.. క్రమంగా స్నేహంగా మెలుగుతున్నారని, పండగలకు ఇళ్లకు ఆహ్వానిస్తున్నారని విదేశీ విద్యార్థులు చెబుతున్నారు. స్నేహితులతో సినిమాలకు, పర్యాటక ప్రాంతాలకు వెళుతుంటామన్నారు. ఎండ తీవ్రంగా ఉంటుంది ఓయూలో ప్రస్తుతం ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాను. మా దేశానికి భిన్నంగా ఇక్కడ వాతావరణం ఉంది. మేలో ఎండ ఎక్కువ. వర్షాకాలాన్ని ఎంజాయ్ చేస్తున్నాను. ఇక్కడ చాలా మంది స్నేహితులయ్యారు. వాళ్లతో సరదాగా బయటకి వెళ్తుంటాను

**హైదరాబాద్ నా రెండో ఇల్లు**

ఓయూలోనే గతంలో పీజీ పూర్తి చేశాను. ఇప్పుడు పీహెచ్‌డీ చదువుతున్నాను. నా కుటుంబంతోపాటు ఇక్కడ ఉంటున్నా. పిల్లల్ని స్థానిక పాఠశాలలో చేర్పించా. ఇక్కడి ప్రజలు సొంతవారిలాగా అనిపిస్తుంటారు. హైదరాబాద్ నా రెండో ఇల్లుగా భావిస్తాను.

**విద్యార్థుల సంఖ్య పెంచడానికి చర్యలు**

ఓయూ వీసీ కుమార్ మొలుగరం సహకారంతో వర్సిటీలో విదేశీ విద్యార్థుల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది ఇప్పటివరకు ఐసీసీఆర్ ద్వారా వర్సిటీలో ప్రవేశం కోసం 615 మందికి ప్రొవిజన్ అడ్మిషన్ లెటర్ ఇచ్చాం. 1999లో ఇంటర్నేషనల్ ఎఫైర్స్ ప్రారంభమైనప్పటి నుంచి సుమారు 20వేల మంది విదేశీ విద్యార్థులు ఓయూలో చదువుకున్నారు.

# సర్కారు దృష్టి సారిస్తే సూపర్ సేవలు..!



ఖమ్మం : ఖమ్మం జిల్లాకేంద్రంలో ప్రభుత్వ వైద్యకళాశాలకు అనుబంధంగా కొనసాగుతున్న సర్వజనాసుపత్రి(జీజీహెచ్)కి వచ్చే రోగుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రస్తుతం రోజూ 1,500-2,000 మంది ఓపీ సేవలు వినియోగించుకుంటున్నారు. వీరిలో సుమారు 500 మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఏపీలోని సరిహద్దు జిల్లాల పేదలు ఇక్కడికి వస్తున్నారు. దీన్ని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా ఉన్నతీకరిస్తే 50లక్షల మందికి మేలు జరుగుతుంది.

**కలెక్టర్‌కు నివేదిక అందజేత**

ఖమ్మంలో రెండేళ్ల క్రితం 100 సీట్లతో ప్రభుత్వ వైద్యకళాశాల మంజూరైంది. జిల్లా ఆసుపత్రిని 575 పడకలతో బోధనాసుపత్రిగా ఉన్నతీకరించారు. తొలుత 150 వైద్యవిద్య సీట్లు కేటాయించి ఉంటే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చటం సులువయ్యేది. సర్వజనాసుపత్రిని 'సూపర్ స్పెషాలిటీ'గా మార్చాలనుకుంటే ఏఏ వసతులు కల్పించాలి, వైద్యులు, సిబ్బంది నియామకం, పేదలకు ఒనగూరే ప్రయోజనాలపై సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో వైద్యులు నివేదిక రూపొందించి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ఇటీవల సమర్పించారు. ప్రత్యేక భవనం నిర్మించటంతోపాటు వైద్యులు, సిబ్బంది నియామకం, అత్యాధునిక వైద్యపరికరాలు అవసరమని నివేదించారు. కార్డియాలజీ, సీటీవీఎస్(కార్డియో థొరసిక్ వాస్క్యులర్ సర్జరీ), న్యూరాలజీ, న్యూరోసర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ (మెడికల్, సర్జికల్), అంకాలజీ(మెడికల్, సర్జికల్), ప్లాస్టిక్ సర్జరీ సేవలందుతాయి. గుండె విభాగంలో ఈసీజీ, టీఎంటీ, టూడీ ఎకో, ఈఈజీ, సీటీ, ఎంఆర్ఐ, డిజిటల్ ఎక్స్‌రే, సైటోస్కోప్, ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, కీమోథెరపీ, అంకాలజీ సర్జికల్ కిట్లు, మైక్రో వాస్క్యులర్, లేజర్ తదితర పరికరాలు జీజీహెచ్‌కు వస్తాయి. వీటి కొనుగోలుకు రూ.17.25కోట్లు వెచ్చించాలని అంచనా. సూపర్ స్పెషాలిటీ సేవలందించటానికి 84 మంది వైద్యులు (ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్, జూనియర్ రెసిడెంట్లు) అవసరం. సుమారు 100 మంది స్టాఫ్ నర్సులు, 72 మంది పారామెడికల్, నిపుణులు, పరిపాలన విభాగంలో సిబ్బందికి ఉద్యోగాలు దొరుకుతాయి. పరోక్షంగా వందలాది మందికి ఉపాధి లభిస్తుంది.

**ప్రయోజనాలిలా..**

గుండెపోటుతో పరిస్థితి విషమించినా.. క్యాన్సర్, మెదడు, నాడీవ్యవస్థతో బాధపడుతున్నవారిని హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. ఖమ్మం సర్వజనాసుపత్రి 'సూపర్ స్పెషాలిటీ'గా మారితే ఆంజియోగ్రామ్, ఆంజియోప్లాస్టి, పేస్‌మేకర్, బైపాస్ సర్జరీ, వాల్వ్ రిప్లేస్‌మెంట్, థొరసిక్ ట్రామా తదితర గుండె సంబంధిత సేవలు, పార్కిన్‌సన్స్ వ్యాధి, మైగ్రేన్, మెదడు, నాడీవ్యవస్థ, డయాలసిస్, మూత్రపిండాల వ్యాధులు, ప్రొస్టేట్ సర్జరీ, మూత్రపిండాల్లో రాళ్లు తొలగించటం, ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, కీమోథెరపీ, బోన్‌మ్యారో, క్యాన్సర్ చికిత్సలతోపాటు కాలిన గాయాలకు ప్లాస్టిక్ సర్జరీలాంటి అత్యాధునిక వైద్యసేవలందుతాయి.

# ఫలించిన ఐదేళ్ల నిరీక్షణ..!



ఖమ్మం : క్షేత్రస్థాయిలో సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్న ఉద్యానశాఖకు ప్రభుత్వం తీపికబురు అందించింది. నాలుగేళ్ల క్రితం పొరుగు సేవలపై పనిచేసి తొలగింపునకు గురైన ఉద్యాన విస్తరణ అధికారులు(హెచ్‌ఈఓ)లను తిరిగి తీసుకోనున్నట్లు ఇటీవల ఉత్తర్వులు వెలువరించింది. రాష్ట్రవ్యాప్తంగా 175 మందిని నియమించింది. వీరిలో ఖమ్మం జిల్లాకు 12 మంది, భద్రాద్రి జిల్లాకు 13 మందిని కేటాయించింది. ఖమ్మం జిల్లాలో 78వేల మంది రైతులు 1.70లక్షల ఎకరాల్లో, భద్రాద్రి జిల్లాలో 80వేల మంది 1.82లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు పండిస్తున్నారు.

**2006లో పొరుగుసేవల విధానంలో..**సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సూక్ష్మసేద్యం పథకం కింద 2006లో తొలిసారిగా హెచ్‌ఈఓలను పొరుగు సేవల విధానంలో నియమించారు. అప్పట్లో బిందుసేద్యం, తుంపర్లసేద్యం తదితర పథకాల అమలులో వీరు కీలకంగా వ్యవహరించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రాయితీ పథకాలు అందించటంలో ప్రధాన భూమిక పోషించారు. నెలకు రూ.4,500 వేతనంతో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వర్తించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక ఏపీఎంఐపీని ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖలో విలీనం చేసింది. సూక్ష్మసేద్యం పథకాలతో పాటు ఉద్యాన పథకాలను రైతుల దరికి చేర్చేందుకు హెచ్‌ఈఓలు చొరవ చూపారు. 2020 ఏప్రిల్‌లో భారాస సర్కారు రాష్ట్రవ్యాప్తంగా హెచ్‌ఈఓలను తొలగించింది. అప్పటి నుంచి తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారంతా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో హెచ్‌ఈఓల భాగస్వామ్యం కీలకమని గుర్తించింది. 175 మందిని తిరిగి విధుల్లోకి తీసుకుంది.

**తొలగనున్న పనిభారం**

ప్రస్తుతం ఒక్కో శాసనసభ నియోజకవర్గానికి ఒక ఉద్యానాధికారి చొప్పున పనిచేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఐదుగురు, భద్రాద్రి జిల్లాలో ఐదుగురు విధులు నిర్వర్తిస్తున్నారు. నియోజకవర్గం మొత్తానికి ఒక్కరే ఉండటం వల్ల వీరిపై పనిభారం ఎక్కువైంది. ఫలితంగా క్షేత్రస్థాయిలో పథకాలు అమలుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. హెచ్‌ఈఓల రాకతో ఉద్యానాధికారులపై పనిభారం తగ్గనుంది. 'ఉద్యాన విస్తరణాధికారుల నియామకానికి సంబంధించి జిల్లాల వారీగా ఉత్తర్వులు అందాల్సి ఉంది. అవి వచ్చిన వెంటనే హెచ్‌ఈఓలకు బాధ్యతలు అప్పగిస్తాం' అని ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి ఎంవీ మధుసూదన్‌కు తెలిపారు.

# ప్రత్యామ్నాయం చూపకుండా ఇదేం తీరు!

జగిత్యాల: జగిత్యాల నూకపల్లి అర్బన్‌కాలనీలోని పలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శనివారం తెల్లవారుజామున అధికారులు నేలమట్టం చేశారు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న జీవన్‌రెడ్డి పట్టణంలోని ఇళ్లు లేని పేదల కోసం సుమారు 200 ఎకరాల భూసేకరణ జరిపి 4 వేల మందికి పట్టాలు అందజేశారు. అందులో సుమారు 1,730 మంది నిర్మాణాలు ప్రారంభించుకున్నారు. కొన్ని పూర్తి కాగా మరికొన్ని బేస్‌మెంట్ స్థాయి వరకు, ఇంకొన్ని లెంటల్ వరకు పనులు జరిగాయి. భారాస ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని నిలిపివేసి రెండు పడక గదుల ఇళ్లను తెరపైకి తెచ్చింది. 4520 ఇళ్ల నిర్మాణాలు జరిగినా వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు వెళ్లలేదు.

**గతంలో అభ్యంతరాలతో నిలిపివేత**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అర్బన్‌కాలనీలో రహదారులు, మురుగుకాలువలు, తాగునీరు తదితర వసతుల కోసం నిధులు మంజూరు చేయగా పనులు పూర్తి కావస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాత నిర్మాణాలను తొలగించేందుకు గతంలో అధికారులు ప్రయత్నించినప్పటికీ అభ్యంతరాలు రావడంతో నిలిపివేశారు. గతంలో తమ పార్టీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లలో వివిధ స్థాయిల్లో ఉన్న వాటిని పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి ఇటీవల ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. కాలనీలో పాఠశాల, ఆరోగ్య, అంగన్‌వాడీ కేంద్రాల



నిర్మాణాల కోసం అవసరమైన స్థలాన్ని గుర్తించాలని అధికారులు నిర్ణయించారు. ఖాళీగా ఉన్న స్థలాన్ని చదును చేయాలని సూచించారు. ఎక్కడైనా ఒకటి, రెండు నిర్మాణాలు అడ్డుగా ఉంటే లబ్ధిదారులకు నచ్చజెప్పి అవసరమైతే రెండు పడక గదుల ఇళ్లు కేటాయించడమో లేదా మరో ప్రదేశంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరివ్వడమో చేయాలని అధికారులు నిర్ణయించగా పొక్లెయినర్లతో నిర్మాణాలను కూల్చివేశారు. చివరి దశలో ఉన్న 13 నిర్మాణాలతో పాటు మరో 120 బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న నిర్మాణాలను తొలగించారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఏకపక్షంగా కూల్చివేయడం సరికాదని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఓ అధికారి మాట్లాడుతూ ఖాళీ స్థలాన్నే చదును చేశామని, ఒకటి రెండు నిర్మాణాలు కూల్చివేసినప్పటికీ పనులు నిలిపివేశామన్నారు.

# పొదుపే శ్వాస.. అధికవడ్డీ ఆశ

మిర్యాలగూడ : సాధారణ పేద, మధ్య తరగతి ప్రజలు..రోజు వారీ పనులు చేసి సంపాదించే దాంట్లో కొంత దాచుకోవాలని అనుకుంటారు. ఇంట్లో దాచిపెడితే ఏదో ఒక అవసరానికి వాడేస్తామనే భయంతో తెలిసిన వారి వద్ద.. బంధువులకు తెలిసిన వారి వద్ద చిట్టీలు కట్టడం సహజం. ఇటీవల కాలంలో పలువురు చిట్టీల వ్యాపారులు కొంత కాలం తర్వాత బోర్డు తిప్పేస్తుండడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. మధ్యతరగతి ప్రజలకు డబ్బుపై ఆశతో పాటు..అనేక అవసరాలు ఉంటాయి. దీనిని ఆసరాగా చేసుకుంటున్న మోసగాళ్లు..చిట్టీలు, లక్కీడ్రా స్కీమ్‌లు, అధిక వడ్డీల పేరిట అప్పులు తీసుకుని రూ.కోట్లలో దోచుకుని ఉడాయిస్తున్నారు. వీరు తొలుత కొంత కాలం నమ్మకస్తులుగా ఉంటూ..వారికి క్రమం తప్పకుండా చెల్లింపులు చేస్తారు. చిట్టీలు కట్టించుకునే వారు..చిట్టీ అయిపోయిన, పాడుకున్న వారి వద్ద నుంచి అధిక వడ్డీల ఆశ చూపి నిర్వాహకులే నగదు తీసుకుంటున్నారు. పెద్ద మొత్తం నగదు వస్తే ఏదో ఒక అవసరానికి ఉపయోగపడుతుందనే మధ్య తరగతి ప్రజల అమాయకత్వాన్ని చూసి..నట్టేట ముంచుతున్నారు. మరో వైపు ప్రతి నెలా కొంత నగదు కట్టించుకుని..డ్రా తీస్తూ..విజేతలకు ఖరీదైన బహుమతులు అందిస్తామని..చివర్లో తాము చెల్లించిన నగదుకు సరిపడా బహుమతి ఇస్తామని ఇటీవల కొన్ని బోగస్ సంస్థలు వేలాది మంది నుంచి



రూ.కోట్లలో వసూలు చేసి బోర్డు తిప్పేశాయి.

**ఇటీవల జరిగిన ఘటనలు కొన్ని...**

ః మిర్యాలగూడ ప్రాంతంలో లక్కీ డ్రా పేరుతో ఓ సంస్థను స్థాపించి వేలాది అమాయకుల నుంచి రూ.కోట్లతో నగదు వసూలు చేసి కనిపించకుండా పోయారు.

ః పీఏ పల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి అమాయక గిరిజనుల నుంచి అధిక వడ్డీల పేరుతో రూ. కోట్లలో అప్పులు తీసుకుని జల్సాలు చేస్తున్న ఉదంతం ఇటీవల కలకలం సృష్టించింది.

ః మిర్యాలగూడ పట్టణంలో చిట్టీలు, వడ్డీల పేరుతో రూ.కోట్లతో వసూలు చేసి..తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఓ మోసగాడిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

కె. రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడఆర్థిక లావాదేవీల అంశంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెలియని వారి వద్ద, అనుమతులు లేని వారి వద్ద చిట్టీలు వేయడం, బహుమ తులు, రెట్టింపు నగదు ఆశ చూసే సంస్థల్లో పెట్టుబడులు పెట్టడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. అధిక వడ్డీల ఆశతో అప్పులు ఇవ్వడం కూడా సరైంది కాదు. ఆర్బీఐ అనుమతులు ఉన్న సంస్థల్లో పెట్టుబడులు, జాతీయ బ్యాంకుల్లో నగదు దాచుకుంటేనే భరోసా ఉంటుంది.

# 'సంపు'తోంది..!

కోదాడ : ప్రమాదకరంగా సంపు కనిపిస్తున్న ప్రాంతం కోదాడ పట్టణంలోనిది. ఇలాంటి ప్రమాదకరమైన సంపులోనే పడి చిన్నారులు మృతి చెందుతున్నారు. అయినా కొందరు సంపులను ఇలా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. చిన్నారులే కాదు పెద్దవారూ ఇలాంటి సంపులో పడితే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఇంటి యజమానులు సంపులో చిన్నారులు పడకుండా ప్రత్యేకంగా గ్రిల్, బండలు ఏర్పాటు చేసుకుంటే ప్రమాదాలు నివారించొచ్చు. మానవ అవసరాల నిమిత్తం ప్రతి ఒక్కరూ ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్న నీటి సంపులతో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. అభం శుభం తెలియని చిన్నారుల పాలిట అవి యమపాశాలుగా మారుతున్నాయి. ఇంట్లో చిన్నారులు ఉన్నారని తెలిసి కూడా పెద్దలు సంపుల నిర్వహణపై నిర్లక్ష్యం వహించడం వారికి శాపంగా మారుతోంది.

కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన దంపతుల 20 నెలల కుమారుడు మంగళవారం నీటి సంపులో పడి మృత్యుఒడికి చేరిన విషాద ఘటన అందరినీ కలిచివేసింది. రోజులాగే తల్లి అన్నం తినిపించి చిన్నారిని పడుకోబెట్టింది. నిద్ర లేచిన చిన్నారి ఆడుకునేందుకు ఇంటి వెనక ఉన్న సంపు దగ్గరికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయి మృతి చెందాడు.

గతేడాది అనంతగిరి మండలంలోని ఓ గ్రామంలో ఇంట్లో చిన్నారి ఆడుకుంటూ ఉండటంతో తల్లిదండ్రులు పర్యవేక్షించడం మరిచారు. ఇంట్లోని బకెట్ నిండా నీళ్లు ఉండడంతో చిన్నారి ఆ నీటితో ఆడుకుంటున్న క్రమంలో తల బకెట్‌లోకి ముంచడంతో బోర్లా పడ్డాడు. ఊపిరాడక రెండేళ్ల చిన్నారి మృతి చెందాడు.



**తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

సంపు మీద ఏర్పాటు చేసిన బిల్లలు పగిలిపోతే వెంటనే కొత్తవి ఏర్పాటు చేసుకోవాలి. చిన్నారులను సంపుల సమీపంలో ఆడకుండా జాగ్రత్తలు చేపట్టాలి.

సంపులో పడిపోతే ప్రమాదం అనే భయాన్ని పిల్లలకు నేర్పించాలి.

సంపు మీద ఇనుముతో తయారు చేసిన గ్రిల్ ఏర్పాటు చేసుకుంటే ప్రమాదాలు అరికట్టవచ్చు.

తల్లిదండ్రులు చిన్నారులు ఆడుకునే సమయంలో పొంచి ఉన్న ప్రమాదాలను పసిగట్టాలి.

ఆడుకునే సమయంలో ఎలాంటి పనులు పెట్టుకోకుండా నిరంతరం పర్యవేక్షించాలి.

**పర్యవేక్షణ తప్పనిసరి**

శ్రీధర్‌రెడ్డి, డీఎస్పీ, కోదాడ

చాలా మంది ఇళ్లలో ఏర్పాటు చేసుకున్న సంపులను పటిష్ఠపరచాలి. చిన్నారులు సంపుల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆడుకునే సమయంలో కొందరు తల్లిదండ్రులు పిల్లలను వదిలేసి ఇంట్లో పనులు చేసుకుంటున్నారు. దీంతో చిన్నారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలా కాకుండా పర్యవేక్షణ తప్పనిసరి చేసుకోవాలి.

# ఆంక్షలే అడ్డంకి!

పెద్దపల్లి : తెల్లకాగితాలపై క్రయవిక్రయ ఒప్పందాలు రాసుకున్న వ్యవసాయ భూములకు పట్టా హక్కులు పొందేందుకు భూభారతిలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. 2014 జూన్ 2 నాటికి ముందు సాదాబైనామాలో కొనుగోలు చేసిన రైతులు క్రమబద్ధీకరణకు అర్జీ చేసుకున్నారు. అయిదేళ్ల క్రితం దరఖాస్తులు స్వీకరించగా ప్రస్తుతం భూభారతిలో ఐచ్ఛికం కల్పించారు. అయితే కోర్టు ఆదేశాలతో పట్టా హక్కుల పరిశీలనపై సందిగ్ధం నెలకొంది. కోర్టు స్టే ఖాళీ చేస్తే తప్ప కదలిక వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కాగా ఆగస్టు 15నాటి శతశాతం భూ సమస్యలు పరిష్కరించే లక్ష్యంగా అధికారులు సిద్ధమవుతున్నారు.

**గతంలో క్రమబద్ధీకరణ ఇలా..**

2016లో అప్పటి ప్రభుత్వం తొలిసారి సాదాబైనామా క్రమబద్ధీకరణలో అయిదెకరాలు మించని వ్యవసాయ భూములను ఉచితంగా తహసీల్దార్ కార్యాలయంలో పట్టా మార్పిడి చేశారు. స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్



ఛార్జీలు తీసుకోలేదు. అయిదెకరాల కంటే ఎక్కువ భూములకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు తీసుకున్నారు. భూభారతిలో అర్జీవోలు విచారణ చేసి అర్హులకు రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ ఛార్జీలు వసూలు చేసి పట్టా హక్కులు కల్పించనున్నారు.

**నిరీక్షణకు ఎదురుచూపులు**

తెల్లకాగితంపై కొనుగోలు చేసిన బాధితుల భూములకు హద్దులను గుర్తించి వాంగ్మూలం తీసుకుంటారు. ఫారం–8 నోటీసులు జారీ చేసి గ్రామపంచాయతీల్లో అతికిస్తారు. అభ్యంతరాలపై సమగ్ర విచారణ చేసి వాస్తవాలు తేల్చి అర్హులకు పట్టాలు పంపిణీ చేస్తారు. ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉండటంతో పరిశీలనలో జాప్యం నెలకొంది. కోర్టు నుంచి అనుమతి వచ్చిన వెంటనే కదలిక వచ్చే అవకాశం ఉంది. గ్రామాల్లో వీర్వోలు లేకపోవడంతో దరఖాస్తుల వడబోత ప్రశ్నార్థకంగా మారింది. మండలానికి ఇద్దరు చొప్పున ఆర్ఐలు విధుల్లో కొనసాగుతున్నారు. ఒక్కొక్కరికి పది కంటే ఎక్కువగానే రెవెన్యూ గ్రామాలు ఉండటంతో దరఖాస్తుల పరిశీలనపై సందిగ్ధం నెలకొంది.

**అర్జీలు భద్రమేనా?**

సాదాబైనామాలో 12 అక్టోబరు 2020 నుంచి 10 నవంబరు 2020 మధ్య కాలంలో క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారికి పట్టా హక్కులు కల్పించనున్నారు. అయిదేళ్ల క్రితం జిల్లాలో 35,580 దరఖాస్తులురాగా ప్రస్తుతం భూభారతిలో మరో 5,787 మంది దరఖాస్తు చేసుకున్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు కూడా మళ్లీ ఆధారపత్రాలతో దరఖాస్తు చేశారు. గతంలో స్వీకరించిన అర్జీలను తహసీల్ కార్యాలయాల్లో భద్రపరిచారు. ఆన్‌లైన్ చేయకపోవడంతో దరఖాస్తులపై ఆందోళన వ్యక్తమవుతోంది. వీటిని భద్రపరిచారా? లేదా అనే అయోమయం నెలకొంది.

# దర్జాగా కబ్జా

బీబీనగర్ : రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. రాత్రికిరాత్రే నిర్మాణాలు సాగుతున్నా అటువైపు చూసే అధికారే కరవయ్యారు. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలోని యాదాద్రి భువనగిరి బీబీనగర్ మండలంలో సుమారు తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమి (బిలా నెంబర్)లో ఆరు ఎకరాల వరకు కబ్జాకు గురైంది.

**మూడు గ్రామాల మధ్యన మిగులు భూమి**

బీబీనగర్ మండలం రహీంఖాన్‌గూడ శివారులోని రెవెన్యూ సర్వే నెంబర్లు 86, 87, 88, 89, రాఘవాపురం రెవెన్యూ సర్వే నెంబర్లు 572, 573, 574, 575, బీబీనగర్ రెవెన్యూ సర్వే నెంబర్ 522లకు మధ్యన, మూడు రెవెన్యూ గ్రామాల నడుమ సుమారు తొమ్మిది ఎకరాల మిగులు భూమిని గతంలో రహీంఖాన్‌గూడ గ్రామానికి చెందిన కొందరు రైతులు (పక్క సర్వే నెంబర్ల పట్టాదారులు) సాగు చేసే వారు. ఆ తర్వాత ఇరవై ఏళ్ల కిందట సదరు పట్టాదారులు వారిపై పట్టా ఉన్న మొత్తం భూమిని వేరొకరికి విక్రయించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మూడేళ్ల కిందట తమ కుటుంబానికి చెందిన భూమిని మేం సాగుచేసుకుంటామని కొందరు వచ్చి అక్కడ పాక వేసేందుకు ప్రయత్నించగా అది ప్రభుత్వ భూమి అని నాటి సర్పంచి మంచాల రవికుమార్ వారించారు. అయినా వారు వినకుండా అక్కడ సాగుచేసేందుకు ప్రయత్నించడంతో సర్పంచి రవికుమార్ 2022లో బీబీనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయి పరిశీలన చేసి, ప్రభుత్వ మండల సర్వేయర్‌తో సర్వేచేసిన తర్వాత నాటి తహసీల్దార్ అశోక్‌రెడ్డి సదరు స్థలం మూడు గ్రామాల శివారుల మధ్య ఉన్న ఖాళీ భూమి (బిలా నెంబర్) అని, అది ప్రభుత్వానికి చెందుతుందని అధికారికరంగా ధ్రువీకరించారు.

**విద్యుత్తు అనుమతులు ఇవ్వకున్నా..**

రహీంఖాన్‌గూడ శివారులోని భూమిలో బోరు వేసి సౌర విద్యుత్తు సాయంతో అక్కడ సాగుచేయడం మొదలుపెట్టారు. అప్రమత్తమైన గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రభుత్వ భూమిలో అక్రమంగా చొరబడ్డ వారికి ఇంటి, విద్యుత్తు అనుమతులు ఇవ్వొద్దని నాటి సర్పంచి అధికారిక లెటర్ హెడ్‌పై 2024 జనవరి 22న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు మారడం, సర్పంచి పదవీకాలం ముగియడంతో వారిని పట్టించుకునే వారు లేకపోవడంతో ఆక్రమణదారులు సాగుతో ఆగకుండా కట్టడాలకు తెరలేపారు. రహీంఖాన్‌గూడ గ్రామపంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి రామకృష్ణను వివరణ కోరగా ఆ విషయం తమకు తెలియదనడం కొసమెరుపు. ప్రభుత్వ భూమిగా గుర్తించిన ఖాళీ స్థలం నుంచి ఆక్రమణదారులను పంపించాలని 2023 ఫిబ్రవరి 14న (ఫైల్ నెంబర్– బి/161/2023) ద్వారా బీబీనగర్ పోలీసులకు లేఖ కూడా రాశారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇన్నాళ్లు ఖాళీగా ఉన్న భూమిలో ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం**

బీబీనగర్, రహీంఖాన్‌గూడ, రాఘవాపురం గ్రామాల మధ్యన ఉన్న మిగులు భూమిని గత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన, సర్వేచేసి బిలా నంబర్‌గా గుర్తించారు. సదరు భూమిపై పూర్తిహక్కులు ప్రభుత్వానికే ఉంటాయి. ఆక్రమణదారులు కాదని కబ్జాచేసేందుకు యత్నిస్తే చర్యలు తప్పవు. శ్యాంసుందర్‌రెడ్డి, తహసీల్దార్, బీబీనగర్

# 'అమృత్' యోగం.. మందగమనం



తాండూరు: తాండూరు పట్టణం క్రమేపీ విస్తరిస్తోంది.. జనాభా అదే స్థాయిలో పెరుగుతోంది. తాగునీటి అవసరాలు మాత్రం తీరడం లేదు. ఏ కాలమైనా స్థానికులు ఎద్దడి ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద నిధులు మంజూరు చేసింది. గతేడాది ఆగస్టులో పనులకు శంకుస్థాపన జరిగినా, దాదాపు పది నెలలు గడుస్తున్నా వేగం పెరగలేదు. ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మించేందుకు రెండు చోట్ల గుంతలు తవ్వి వదిలేశారు. ఒక చోట మాత్రమే పనులు ప్రారంభించారు.

**పూర్తయితే 3 ఎం.ఎల్.డి. నీటి సరఫరా..**

ఈ పథకం ద్వారా తాగునీటి సరఫరా ప్రాజెక్టు పూర్తయితే పట్టణ వాసులకు నిత్యం 3 ఎం.ఎల్.డి.(మిలియన్ లీటర్ ఫర్ డే) నీరు సరఫరా జరుగుతుంది. ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్‌గృహకల్ప కాలనీల్లో 500 కె.ఎల్ చొప్పున నీటి సామర్థ్యం ఉన్న ఒక్కో ట్యాంకు, పాత మున్సిపల్ కార్యాలయం వద్ద 1,000 కె.ఎల్ సామర్థ్యం ఉన్న ఒక ట్యాంకు నిర్మిస్తారు. వీటికి మిషన్ భగీరథ ద్వారా 3 ఎం.ఎల్.డి. నీరు సరఫరా చేస్తారు. మొత్తం 60 కిలోమీటర్ల పొడవునా విస్తరించే పైపులైన్‌ను పట్టణంలోని పాత పైపులైన్‌కు అనుసంధానించి నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. పనులు వేగంగా జరగక పోవడంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు. అవసరాలకు నీటిని కొనుగోలు చేస్తున్నారు. చిన్న కుటుంబాలైతే ప్రతి నెలా రూ.300, పెద్ద కుటుంబాలు రూ.600 చొప్పున వ్యయం చేస్తున్నాయి

**వినియోగంలోకి రాని పాత పంప్‌హౌస్..**

తాండూరు పట్టణ వాసులకు ఒకప్పుడు అవసరానికి తగ్గట్టు తాగునీటిని సరఫరా చేసిన రెండు పంప్‌హౌస్‌ల్లో ఒకటి వినియోగించడంలేదు. దీన్ని అందుబాటుల్లోకి తీసుకురావాల్సిన అధికారులు అటు వైపు దృష్టి పెట్టడం లేదు.

ఇదీ సమాచారం

మున్సిపాలిటీ: తాండూరు
వార్డులు: 36
నివాస గృహాలు: 14,000
అధికారిక జనాభా: 71,000
అనధికారిక జనాభా లెక్క: లక్షకు పైనే
కుళాయిలు: 9,000
ఓవర్‌హెడ్ ట్యాంకులు: 6
నిత్యం అవసరమయ్యే తాగునీరు: 12 ఎం.ఎల్.డి
మిషన్ భగీరథ, పాత పంప్‌హౌస్ నుంచి సరఫరా జరుగుతున్నది: 9 ఎం.ఎల్.డి.

ఆరు నెలల్లో మెరుగైన నీటి సరఫరా

తాండూరు పట్టణానికి ఆరు నెలల్లో మెరుగైన తాగునీటి సరఫరా చేస్తాం. అమృత్ 2.0 పనులు ఆలోగా పూర్తి చేస్తాం. ప్రత్యేకంగా విస్తరించే పైపులైన్‌ను పట్టణంలోని పాత పైపులైన్‌కు అనుసంధానిస్తాం. ప్రజల అవసరాలకు తగ్గట్టు 12 ఎం.ఎల్.డి. నీటిని సరఫరా చేస్తాం. నిరుపయోగంగా ఉన్న పంప్‌హౌస్ అందుబాటులోకి తీసుకువస్తాం. ఖాజాహుస్సేన్, సహాయ ఇంజినీరు.

# తప్పు చేసి.. ముప్పును పసిగట్టి



కరీంనగర్: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ.37 లక్షలు అప్పనంగా పలు ఖాతాల్లోకి మళ్లించారు. చేసిన తప్పును తెలుసుకొని తిరిగి వాటిని ఖజానాకు జమ చేస్తున్నారు. ప్రణాళిక లేకపోవడం, పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ఇచ్చిన సొమ్మును తిరిగి రాబడుతున్నారు. జిల్లా విద్యాశాఖలోని ఈ వింత వైఖరి ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ బడుల్లోని మౌలిక వసతుల కల్పనకు కొన్ని నెలల కిందటి నుంచి దృష్టి సారించారు. స్వయం సహాయక సంఘాలతోపాటు ప్రధానోపాధ్యాయులు పలు అభివృద్ధి పనులను కలిసికట్టుగా చేశారు. ఈ పనులను ఇంజినీరింగ్ శాఖ, విద్యాశాఖలోని ప్రణాళిక విభాగం అధికారులు పర్యవేక్షించారు. పనుల విషయంలో ఈ అధికారులే అంచనాలు రూపొందించారు. వేగంగా జరగాలని పురమాయించారు. దీంతో వచ్చిన నిధులు ఖర్చవడం.. బిల్లులు చెల్లించడం చకచకా అయిపోయాయి.

**అసలు 'చిక్కు' ఇక్కడే..!**

చేసిన పనులకు కొలతలేసి.. ఎంబీ రికార్డులు నమోదు చేసి బిల్లులు చెల్లించాక.. విద్యాశాఖ అధికారులు ఆలస్యంగా కళ్లు తెరిచారు. చేసిన పనికంటే బిల్లులను ఎక్కువ చెల్లించామని గుర్తించారు. తప్పును సరిదిద్దుకునేందుకు ఇంజినీరింగ్ అధికారులతోపాటు విద్యాశాఖ జిల్లాధికారులు తంటాలు పడుతున్నారు. పాఠశాలల వారీగా అదనంగా వెళ్లిన డబ్బులను తిరిగి ఇవ్వాలని పలువురు ప్రధానోపాధ్యాయులతో పాటు వీవోలకు హుకుం జారీ చేశారు. స్వయం సహాయ సంఘాల్లోని వీవోలతోపాటు ప్రధానోపాధ్యాయుడి సంయుక్త ఖాతాలో నగదును బదిలీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 344 పాఠశాలకు సంబంధించి చేపట్టాల్సిన పనులకు అంచనాలు రూపొందించారు. 336 చోట్ల తాగునీటి వసతి పూర్తయింది. 319 బడుల్లో విద్యుత్తు వ్యవస్థ మెరుగైంది. చిన్నపాటి మరమ్మతులు 304 పాఠశాలల్లో పూర్తయ్యాయి. 335 చోట్ల మూత్రశాలలు నిర్మించారు. రంగులు వేయడం తదితర పనులను 286 చోట్ల చేపట్టారు. వీటికి సంబంధించి రూ.9.83 కోట్లను ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లోకి జమ చేశారు. ఎక్కువ బిల్లులిచ్చామని తిరిగి వసూలుకు శ్రీకారం చుట్టారు.

**రూ.30 లక్షల రికవరీ..!**

114 పాఠశాలల విషయంలో ఇలా తప్పు జరిగినట్లు విద్యాశాఖ అధికారులు ఆలస్యంగా గుర్తించారు. 25 శాతం మొబిలైజేషన్ మొత్తాన్ని అదనంగా ఇచ్చామని గుర్తించారు. ఇలా రూ.37 లక్షల పైచిలుకు ఖాతాల్లోకి వెళ్లింది. ఇందులో ఇప్పటి వరకు రూ.30 లక్షలు రికవరీ చేశారు. మరో 15 బడుల నుంచి రూ.7లక్షలు వసూలు చేయాల్సి ఉంది. గత కొన్ని రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా ఈ పనులను విద్యాశాఖలోని కొందరు చక్కబెట్టారు. ఒక్కో ప్రధానోపాధ్యాయుడికి ఫోన్ చేసి దబాయిస్తూ మరీ.. సొమ్మును తిరిగి రాబట్టారు. అయితే వీరి వైఖరిని ప్రధానోపాధ్యాయులు, వీవోలు తప్పుబడుతున్నారు. కొందరి నుంచి బలవంతంగా ఖాళీ చెక్కులను తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై జిల్లా విద్యాధికారి మొండయ్యను వివరణ కోరగా తాను ఇటీవల బాధ్యతలు చేపట్టానని, గతంలో బిల్లుల చెల్లింపు విషయంలో గందరగోళమనే పరిస్థితి తన దృష్టికి వచ్చిందని దీనిపై దృష్టి సారిస్తానన్నారు.

# నీటిచుట్టూ పాచి.. రోగాల బూచి..!

సూర్యాపేట : వర్షాలు ప్రారంభమయ్యాయి. వ్యాధులు ముసురుకునే సమయం ఇదే. దోమలతోనే కాకుండా మంచినీరు కలుషితం కావడం వల్ల కూడా ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకునేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లుగానే ప్రత్యేకంగా వానాకాలం మంచినీటి ట్యాంకుల నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమం చేపడితే తప్పా.. ఉన్న ట్యాంకులు శుభ్రమయ్యే పరిస్థితి లేదు. కొన్ని పురపాలికల్లో నెలలో రెండు సార్లు శుభ్రం చేస్తున్నట్లు చెబుతున్నా వాస్తవానికి నెలకుపైగా సమయం తీసుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం సిబ్బంది కొరత ఉండటమే కాక కొంత నిర్లక్ష్యం కూడా ఉంది. పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం మంది ప్రజలు మంచినీటిని కొనుక్కొని తాగుతుండటం వల్ల ట్యాంకుల శుభ్రతపై అధికారులు దృష్టి సారించడం లేదు. హుజూర్‌నగర్‌లో నెలకోసారి ట్యాంకులను శుభ్రం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. సిబ్బంది కొరత వల్ల అన్ని సార్లు సాధ్యం కావడం లేదు. పట్టణంలో మొత్తం 11 ట్యాంకులున్నాయి. అన్నీ వాడకంలోనే ఉన్నాయి. పురపాలికలో 28 వార్డులు ఉండగా.. 8,600 ఆవాసాలు ఉన్నాయి. 8,600 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. పట్టణం పెరుగుతున్నందున మరో 2 వేల వరకు నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. ట్యాంకులకు నీటిని విడుదల చేసే సమయంలో సిబ్బంది వెంటనే చూడక పోవడం వల్ల నీరు పొంగిపొర్లి చుట్టూ నాచుపట్టి అపరిశుభ్రంగా తయారవుతోంది. కొన్నిసార్లు మంచినీటి ట్యాంకుల ద్వారా నీరు విడుదల చేయలేని రోజుల్లో ఒక కలుషితమైన బావి నుంచి ఇస్తున్నారు. కమిషనర్ శ్రీనివాసరెడ్డిమాట్లాడుతూ.. నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయిస్తున్నామన్నారు. కోదాడ పట్టణంలో చాలా వరకు నీటి ట్యాంకులు పాకురు పట్టి దర్శనమిస్తున్నాయి. పట్టణ వ్యాప్తంగా సుమారు 21 ట్యాంకులు ఉన్నాయి. వీటిలో చాలా ట్యాంకులు పాకురు పట్టి, నీరు లీకేజీతో ఉన్నాయి. ఈ చిత్రంలో ట్యాంకు చుట్టూ పాకురు పట్టి కనిపిస్తున్న ప్రాంతం పట్టణంలోని మాతానగర్‌లోనిది. ట్యాంకు బయటి వైపే ఇలా ఉంటే లోపలి పరిస్థితి



అర్థం చేసుకోవచ్చు. పుర కమిషనర్ రమాదేవి స్పందిస్తూ పట్టణంలోని అన్ని ట్యాంకులు నిత్యం శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశిస్తున్నట్లు తెలిపారు.

**సూర్యాపేటలోని శుభ్రం చేసిన ట్యాంకు**

సూర్యాపేట పురపాలికలో ట్యాంకుల శుభ్రతనుర అధికారులు పాటిస్తున్నారు. పట్టణంలో మొత్తం 12 ట్యాంకులు ఉండగా, 11 ట్యాంకులు పట్టణ ప్రజలకు నీటిని అందిస్తున్నాయి. మొత్తం 48 వార్డులుండగా 39,800 నివాసాలు ఉన్నాయి. 70 శాతం నల్లానీటిపై ఆధారపడుతున్నారు. మిగతా 30 శాతం నివాసాలు బోరు నీటిని వినియోగిస్తున్నాయి. మొత్తం నల్లా కనెక్షన్లు 27,820 ఉన్నాయి. 11 ట్యాంకులను నెలకు రెండుసార్లు పుర అధికారులు శుభ్రం చేయిస్తున్నారు. నిర్మల ఆసుపత్రి రోడ్డులోని ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్యాంకు నీటిని నిలిపివేశారు. పుర కమిషనర్‌ను వివరణ కోరగా త్వరలో కొత్త ట్యాంకు నిర్మాణం చేపడతామని, దానికి అనుమతులు వస్తే వెంటనే పాత ట్యాంకును కూల్చివేస్తామని తెలిపారు.

# జల వనరులపై పట్టింపేదీ?

సిరిసిల్ల : చెరువుల మరమ్మతులు కేవలం ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ప్రజలకు బహుళ ప్రయోజనాలు ఇచ్చే జల వనరుల నిర్వహణను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చెరువులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని చెబుతున్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 12 చెరువులు, కుంటలు ఉంటాయి. అందులో కొత్త చెరువు, మినీ ట్యాంక్‌బండ్ మినహా అన్ని కట్టలు తుమ్మచెట్లతో దర్శనమిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

**కట్టలు బలహీనంగా..**

భారాస ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువుల్లో పూడిక తీయించారు. నీటి సరఫరా చేసే తూములు, కాలువలకు మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం చెరువుల్లోకి కొద్దిపాటి నీరు చేరింది. ప్రస్తుతం చెరువులో, కట్టలపై పిచ్చిచెట్లు ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించక క్షేత్ర స్థాయి పరిస్థితి



అధ్వానంగా మారింది. చెరువు కట్టలు బలహీనంగా మారాయి. వర్షాలకు పూర్తి స్థాయిల్లో చెరువులు, కుంటలు నిండి పొర్లి కట్టలు తెగిపోతే పెద్దమొత్తంలో నష్టాలు చవిచూడాల్సి వస్తోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

**గత కష్టనష్టాలను మరిచారా?**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాల పెద్దచెరువు కట్టకు 2021లో గండి పడింది. కట్ట తెగిపోవడంతో సిరిసిల్ల పట్టణాన్ని వరద ముంచెత్తింది. తీవ్ర ఆస్తి నష్టం జరిగింది. పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన దేవయ్య.. రోడ్డు దాటే క్రమంలో వరద నీటిలో మునిగి మృతి చెందారు. నాటి తాలుకు నష్టాల నుంచి పట్టణ ప్రజలు ఇప్పటికీ కోలుకోలేదు. ఇప్పటికైనా మేలుకొని అలాంటి ఘటనలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఏటా చెరువులకు గండ్లు పడుతున్నా పట్టించుకోకపోవడం సరికాదని.. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు స్పందించి చెరువు కట్టలను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

# దళారుల దగా

ధర్మపురి: ధర్మపురి కూరగాయల మార్కెట్లో దళారుల రాజ్యమే నడుస్తోంది. పల్లెల నుంచి రైతులు తీసుకువస్తున్న వివిధ రకాల కూరగాయలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ.. అక్కడే అవే కూరగాయలను రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. వారు లబ్ధి పొందుతూ.. అన్నదాతలు, వినియోగదారులను మోసం చేస్తున్నారు. ధర్మపురి కూరగాయల మార్కెట్లో గత దశాబ్దకాలంగా ఇది కొనసాగుతోంది.

**సుమారు 50 మంది..**

ధర్మపురి కూరగాయల మార్కెట్లో సుమారుగా 50 మంది దళారులు విక్రయాలు సాగిస్తున్నారు. కొద్దిమంది రైతులు మాత్రమే స్వయంగా విక్రయిస్తున్నారు. ప్రస్తుతం బీర, దొండ, వంకాయ, బోడకాకర, సోరకాయలను రైతులు మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. అయితే దళారులు ఒక్కటై రైతులను మభ్యపెట్టి గంప గుత్తగా వారివద్ద నుంచి కూరగాయలు తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ.. అక్కడే అధిక ధరలకు



విక్రయిస్తున్నారు. దళారుల దందా నిబంధనలకు విరుద్ధమేనని తెలిసినా పుర అధికారులు చర్యలు తీసుకోవటం లేదు. రూ.8 కోట్ల వ్యయంతో ఆధునిక వసతులు, హంగులతో మార్కెట్‌ను నిర్మించినా ఆరు బయటే విక్రయాలు జరుగుతున్నాయి. ఓ వైపు వర్షం, పశువుల పేడల మధ్య అపరిశుభ్ర వాతావరణంలోనే విక్రయిస్తున్నారు.

**పన్ను తీసుకుంటూ.. వసతులు కరవు**ప్రతి కూరగాయల విక్రయదారుడి వద్ద పుర అధికారులు పన్ను తీసుకుంటున్నారు. కానీ కనీస వసతులు కల్పించలేకపోతున్నారు. దళారుల ప్రమేయం బాగా ఉంది. దీంతో రైతులు నష్టపోతున్నారు. మార్కెట్ స్థలంలో పశువుల పేడ కార్మికులు తొలగించటం లేదు.– తిరుపతి, రైతు

# అనుసంధాన అవస్థలు

మిర్యాలగూడ : నిరుపేద కుటుంబాల వారికి తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వారికి రక్షణ కల్పించే ఆరోగ్యశ్రీ పథకం నూతనంగా ఇచ్చిన రేషన్‌కార్డుల వారికి అనుసంధాన ప్రక్రియ జాప్యం కావడంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2005లో నూతనంగా అప్పటి ప్రభుత్వం రేషన్ కార్డులు అందించిన సమయంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డులను సైతం అందజేసింది. అప్పట్లో రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు వేర్వేరుగా ఉండేవి. ఆరోగ్యశ్రీ కార్డు తీసుకొని వెళ్తే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందించేవారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సుమారు పదేళ్లపాటు నూతన రేషన్ కార్డులు మంజూరు చేయకపోగా..ఉన్న కార్డులోనే మార్పులు చేసి ఆన్‌లైన్ కార్డులు అందించారు.

ఈ సమయంలో రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకొని ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేశారు. నిరుపేదలు అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లినప్పుడు రేషన్‌కార్డు తీసుకెళ్తే దీని ఆధారంగా ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తూ వచ్చారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల క్రితం కొత్తగా రేషన్ కార్డులను మంజూరు చేసింది. పాత కార్డుల్లో కుటుంబ సభ్యులను చేర్చడం, మృతుల పేర్లు తొలగింపు, కొత్తగా పెళ్లి చేసుకున్న వారికి నూతనంగా కార్డులు అందించారు. వీరికి చౌక దుకాణాల్లో రేషన్ సరకులు సైతం అందిస్తున్నారు.

నూతనంగా ఇచ్చిన రేషన్ కార్డులకు ఉన్నతాధికారులు ఆరోగ్యశ్రీ అనుసంధానం చేయకపోవడంతో సమస్య తలెత్తుతుంది. నూతనంగా మంజూరు చేసిన కార్డులను ఎప్పటికప్పుడు అనుసంధానం చేసినట్లైతే ఆరోగ్యశ్రీ సేవలు అందే అవకాశం ఉంది. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టిసారించి సమస్య పరిష్కరించాలని నూతన రేషన్ కార్డు లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ సమస్యపై తహసీల్దారు శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని వివరించారు.

ఇటీవల మిర్యాలగూడ మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన ఓ చిన్నారికి అనారోగ్య సమస్య తలెత్తగా హైదరాబాద్‌లో ఆపరేషన్ కోసం వెళ్లారు. నూతన రేషన్ కార్డు ఆరోగ్యశ్రీకి అనుసంధానం కాకపోవడంతో అక్కడ తిరస్కరించారు. తిరిగి మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ప్రత్యేకంగా ధ్రువీకరణ పత్రం తీసుకొని వెళ్లడంతో సమస్య తీరింది.



## జగన్ ప్రభుత్వం మూడేళ్లు ఫసల్ బీమా ఇవ్వలేదు

దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో గత జగన్ ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద రైతులకు డబ్బులు ఇవ్వలేదని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. ఫసల్ బీమా యోజన అమలుపై రాజస్థాన్ ఎంపీ హనుమాన్ బేనివాలా లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి చౌహాన్ సమాధానమిచ్చారు. కొన్ని సార్లు రాష్ట్రాలు తమ వాటా ఇవ్వడం లేదని, మరి కొన్ని సార్లు ఆలస్యం చేస్తున్నాయని పేర్కొన్నారు. అయినా, కేంద్రప్రభుత్వం వాటా ప్రకారం రైతులకు వారి ఖాతాల్లో డబ్బులు పడేలా చర్యలు తీసుకున్నామన్నారు. జగన్ సర్కారు మూడేళ్లపాటు రైతులకు ఫసల్‌బీమా యోజన డబ్బులు ఇవ్వకపోయినా .. కేంద్ర ప్రభుత్వం సకాలంలో అమలు చేసిందన్నారు. రాష్ట్రాలు సకాలంలో వారి వాటా ఇవ్వకపోతే.. 12శాతం వడ్డీ కలిపి రైతుల ఖాతాల్లో జమచేయాల్సి ఉంటుందన్నారు.

## ఏఐ పరిశోధన, ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటుకు సహకారం అందించండి: సీఎం చంద్రబాబు




అమరావతి: ఏపీలో ఏఐ పరిశోధన, ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటుకు సహకారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఏఐ సింగపూర్ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ మోహన్ కంకణవల్లి కోరారు. సింగపూర్ పర్యటన మూడో రోజులో భాగంగా ఆయనతో సీఎం భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలతో ఏఐ సింగపూర్ భాగస్వామ్యంగా పని చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలోని విద్యార్థులకు ఏఐ శిక్షణా కార్యక్రమాలు, ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాములు, స్కిల్ డెవలప్‌మెంట్ మాడ్యూల్స్ అమలు చేయాలని ప్రతిపాదించారు. ముఖ్యంగా వైద్యం, వ్యవసాయం, విద్య, పౌర సేవల విషయంలో ఏఐ వినియోగంపై ఇరువురి మధ్య చర్చలు జరిగాయి. టెక్నాలజీ ప్రమోషన్, డీప్ టెక్, ఏఐ రంగంలో ప్రస్తుతం ఉన్న అవకాశాలపైనా చంద్రబాబు-కంకణవల్లి మధ్య చర్చ జరిగింది.




## విశాఖలో గూగుల్ డేటా సెంటర్ పనులు ప్రారంభించాలి

విశాఖలోని ప్రతిపాదిత డేటా సెంటర్ క్యాంపస్‌లో చిప్ డిజైనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ గూగుల్ క్లౌడ్ డైరెక్టర్ డ్రూ బ్రెన్స్‌ను కోరారు. ఏపీతో ఇప్పటికే ఎంవోయూలు చేసుకున్న ప్రాజెక్టులతో పాటు తాజా ప్రతిపాదనపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని బ్రెన్స్ బదులిచ్చారు.

గూగుల్ క్లౌడ్ డైరక్టర్ విశాఖలో డేటా సిటీకి అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ పూర్తి చేసినందున సాధ్యమైనంత త్వరగా గూగుల్ డేటా సెంటర్ పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి కోరారు. చైనా/తైవాన్‌కు దూరంగా ఏపీలో తయారీని ప్రారంభించడానికి గూగుల్.. ఏపీ ద్వారా సర్వర్ సప్లయ్ చైన్‌ను కనెక్ట్ చేసే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. గూగుల్ క్లౌడ్, సర్వర్ సరఫరాదారు దాని మరమ్మత్తు, నిర్వహణ సేవలకు గ్లోబల్ హబ్‌గా ఏపీని ఉపయోగించుకోవచ్చని సూచించారు.

బలమైన ఎయిర్ కనెక్టివిటీ, పోర్టు కనెక్టివిటీ ఉన్నందున అటువంటి కార్యకలాపాలకు ఏపీ అనుకూలంగా ఉంటుందని వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, మంత్రుల బృందం సింగపూర్ పర్యటన మూడో రోజు కొనసాగుతోంది.

## చంద్రబాబు ప్రభుత్వానికి ప్రకృతి కూడా సహకరిస్తోంది: మంత్రి నిమ్మల

అమరావతి: నాగార్జున సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 312 టీఎంసీలకు గాను.. 302 టీఎంసీలకు చేరుకుందని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. దీంతో 18 ఏళ్ల తర్వాత జులైలోనే సాగర్ గేట్లు ఎత్తారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వానికి ప్రజలతో పాటు ప్రకృతి కూడా సహకారం అందిస్తోందని నిమ్మల అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చే ముందు వరకు సాగర్ ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక పుష్కలంగా నీరందించి పంటలు పండించామని మంత్రి తెలిపారు. వరద నీటిని వృథాగా సముద్రంలోకి వదలకుండా పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటామన్న మంత్రి.. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.






## శ్రీవారి మెట్టు మార్గంలో ఏనుగుల కలకలం

చంద్రగిరి: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం శ్రీవారి మెట్టు మార్గంలో ఏనుగులు కలకలం సృష్టించాయి. పంప్ హౌస్ వద్ద 11 ఏనుగుల గుంపును డ్రోన్ కెమెరాతో గుర్తించారు. చెట్టు కొమ్మలు తగలడంతో డ్రోన్ కెమెరా కింద పడిపోయింది. సమీపంలోని పంట పొలాలను గజరాజులు ధ్వంసం చేశాయి. దీంతో ఘటనా స్థలికి చేరుకున్న మూడు విభాగాల అధికారులు శ్రీవినాయక స్వామి చెక్ పాయింట్ వద్ద భక్తులను గంట పాటు నిలిపివేశారు. రాష్ట్ర అటవీ, తితిదే, విజిలెన్స్ అధికారులు సమన్వయంతో ఏనుగుల గుంపును అడవిలోకి తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది భక్తులను బృందాలుగా శ్రీవారిమెట్టు దగ్గరకు తరలిస్తున్నారు.




## వేతనాల పెంపులేనట్లేనా..?

## టీసీఎస్‌లో సీనియర్ల నియామకాలు నిలిపివేత..!

టెక్ దిగ్గజం టీసీఎస్ సీనియర్ల నియామకాలను నిలిపేసినట్లు వార్తలొస్తున్నాయి. దీంతోపాటు వార్షిక వేతనాల పెంపును ఆపినట్లు ఆంగ్ల పత్రిక ఎకనామిక్ టైమ్స్ కథనం వెలువరించింది. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు సంస్థ సీఈవో కె.కృతివాసన్ ప్రకటించిన సమయంలో ఈ విషయం ప్రచారంలోకి రావడం గమనార్హం. ప్రస్తుతం ఐటీ రంగంలో డిమాండ్ తగ్గడం.. కృత్రిమ మేధ నుంచి ముప్పు పొంచి ఉండటం వంటి అంశాలు ఉద్యోగాలపై ప్రభావం చూపిస్తున్నాయి. పరిశ్రమలో పెద్ద కంపెనీగా ఉన్న టీసీఎస్ పాటించే వ్యూహాలను సాఫ్ట్‌వేర్ రంగంలోని ఇతర సంస్థలు కూడా అనుసరించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే నియమించుకొన్న సీనియర్లను కూడా జాయిన్ చేసుకోవడంలో జాప్యం చేస్తోంది. ఇక పుణే, హైదరాబాద్, చెన్నై, కోల్‌కత్తాలోని బెంచ్‌పై నియమిత కాలం కంటే ఎక్కువగా ఉన్న సిబ్బందిని తొలగించే ప్రక్రియను మొదలుపెట్టింది. ఇప్పటికే ఉద్యోగులు 35 రోజులకు మించి బెంచ్‌పై ఉండకూదనే నియమాన్ని అమలుచేస్తోంది. ఇక కంపెనీలోని పరిణామాలపై ఆ సంస్థ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. టీసీఎస్ చేపట్టిన వాటిల్లో మధ్య, సీనియర్ స్థాయి లేఆఫ్‌లే కంపెనీకి రూ.2,400 నుంచి రూ.3,600 కోట్ల వరకు ఆదా చేయనున్నాయి. కాకపోతే ఈ లేఆఫ్‌లను ఒక్కసారిగా కాకుండా.. మెల్లగా ఓ క్రమపద్ధతిలో అమలుచేస్తామని సీఈవో వెల్లడించారు. టీసీఎస్ కంపెనీ ఉద్యోగుల్లో 2 శాతం ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దాదాపు 12 వేలకు పైగా ఉద్యోగాల కోత నిర్ణయంపై కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ దృష్టిసారించినట్లు తెలుస్తోంది. మొత్తం పరిస్థితిని కేంద్రం నిశితంగా గమనిస్తోందని, టెక్ కంపెనీతో టచ్‌లో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గత ఏడాదికి పైగా వ్యవధిలో కంపెనీ షేరు 30 శాతం కుంగింది. నిఫ్టీ సూచీలోని ఐటీ షేర్లలో ఇదే బలహీనంగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.



## నాగార్జునసాగర్ గేట్లు ఎత్తి నీటి విడుదల

నాగార్జున సాగర్: ఎగువ నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 590.00(312.04 టీఎంసీలకు) అడుగులకుగాను ప్రస్తుతం 586.60 అడుగులకు చేరింది. ప్రాజెక్టు గేట్లు ఎత్తిన నేపథ్యంలో.. దిగువ భాగంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. 18 ఏళ్ల తర్వాత.. నెల ముందుగానే నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. సాగర్ గేట్లు ఎత్తడం చాలా సంతోషంగా ఉందన్నారు. "నాగార్జున సాగర్ మనకు ఆధునిక దేవాలయం. సాగర్‌కు నెహ్రూ పునాది వేస్తే.. ఇందిరాగాంధీ ప్రారంభించారు. 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే గొప్ప ప్రాజెక్టు ఇది" అని పేర్కొన్నారు.

**ఉత్తమ్‌పై కోమటిరెడ్డి ఆగ్రహం..!...** ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. నాగార్జున సాగర్ డ్యాం గేట్లు ఎత్తడానికి బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, జిల్లా ఇంఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ బయలుదేరాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటలకే బేగంపేట ఎయిర్‌పోర్టుకు కోమటిరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ చేరుకున్నారు. అయితే.. 10 గంటల వరకు మంత్రి ఉత్తమ్ రాకపోవడంతో.. కోమటిరెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన అలిగి వెళ్లిపోయినట్లు సమాచారం.



## మూసాను పట్టించిన చైనా పరికరం.. ఎలా అంటే..?

పహల్గాం ఉగ్రదాడి మాస్టర్‌మైండ్ సులేమాన్ షా అలియాస్ హషీమ్ మూసా పనిని సైన్యం మూడు గంటల్లో ముగించేసింది. అతడి జాడను గుర్తించిన కమాండోలు మెరుపు వేగంతో ఆపరేషన్ చేపట్టారు. అర్ధరాత్రి కమ్యూనికేషన్‌ను గుర్తించారు. ఆ తర్వాత ఉదయం ఉగ్రవాదుల కదలికలను నేరుగా చూశారు. అంతే.. రాష్ట్రీయ రైఫిల్స్.. పారా కమాండోలు అడవుల్లోకి లంఘించారు. ప్రతి నిమిషం ఉత్కంఠ మధ్య 11 గంటలకు ఉగ్రమూకకు అత్యంత సమీపంలోకి చేరారు. తొలి కాల్పుల్లోనే వారిని మట్టుబెట్టేశారు.

**అర్ధరాత్రి 'అల్ట్రాసెట్' సిగ్నల్స్‌తో అప్రమత్తం..** ఈ ఉగ్రమూక శ్రీనగర్‌లోనే అత్యంత ఎత్తైన మహాదేవ్ పర్వత పరిసరాల్లో నక్కినట్లు సమాచారం అందింది. ఇది 13,000 అడుగుల ఎత్తుతో ఏడాది పొడవునా మంచుతో కప్పి ఉంటుంది. ఈ పరిసర ప్రాంతాలను కశ్మీరీ హిందువులు సావన్ (శ్రావణ)మాసంలో చాలా పవిత్రంగా చూస్తారు. ఈ పర్వత ప్రాంతాల్లో ఆదివారం అర్ధరాత్రి దాటాక రెండు గంటల సమయంలో చైనా తయారీ ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ సెట్ 'టీ82' యాక్టివేట్ అయినట్లు భద్రతా దళాలు గుర్తించాయి. పహల్గాం ఉగ్రదాడిలో వీటిని వాడారు. అలాంటి వాటినే అర్ధరాత్రి మహాదేవ్ పర్వత అడవుల్లో వాడుతుండటంతో దళాలు అప్రమత్తమయ్యాయి. ఆ సెట్ లొకేషన్ డాచిగామ్ నేషనల్ పార్క్‌లో ఉన్నట్లు గుర్తించాయి. సైన్యం, సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీస్ ఆపరేషన్‌కు సన్నాహాలు మొదలుపెట్టాయి. ఉదయం 8 గంటలకు దళాలు డ్రోన్ ఎగురవేసి ఆ చిక్కటి అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టాయి. ముష్కరుల స్థావరాన్ని అంచనా వేశాయి. ఉదయం 9.30 గంటలకు రాష్ట్రీయ రైఫిల్స్-పారా ఎస్ఎఫ్ కమాండోలతో మహాదేవ్ హిల్స్ వైపు వెళ్లారు. 10 గంటల సమయంలో పారా కమాండోలు ఉగ్రవాదుల కదలికలను స్పష్టంగా చూశారు. అటవీ ప్రాంతం చెట్లతో దట్టంగా ఉండటంతో.. ఉగ్రవాదుల క్యాంప్ సమీపానికి చేరి పొజిషన్ తీసుకొనేసరికి 11 గంటలు అయింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా.. ఉగ్రవాదులు గుక్కతిప్పుకోకుండా ఫైరింగ్ చేశాయి. తొలి రౌండ్స్‌లోనే ముగ్గురు టెర్రరిస్టులకు తూటాలు తాకాయి. వారిలో గాయపడి ప్రాణాలతో ఉన్న ఒకడు 11.45 పారిపోయేందుకు యత్నించగా మరోసారి కాల్పులు జరిపారు. ఎన్‌కౌంటర్ ప్రదేశం నుంచి రెండు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఇంకా ఎవరైనా ఉన్నారేమోనని గాలింపు చేపట్టారు.

12.45కు ఉగ్రవాదుల మృతదేహాలను గుర్తించారు. ఉగ్రవాదుల వద్ద నుంచి అమెరికా తయారీ ఎం-4 కార్బైన్, ఏకే-47 రైఫిల్స్, 17 రైఫిల్ గ్రనేడ్లు, భారీ సంఖ్యలో తూటాలు, అల్ట్రాసెట్లను స్వాధీనం చేసుకొన్నారు. ఈ ఉగ్రవాదులు మరో భారీ దాడికి ప్లాన్ చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు.



## తిరుమల శ్రీవారికి భారీ బంగారు కానుక

తిరుమల: తిరుమల శ్రీవారికి ఓ సంస్థ విలువైన బంగారు కానుకలు సమర్పించింది. చెన్నైకి చెందిన సుదర్శన్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ బంగారు శంఖు చక్రాలను అందించింది. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరికి దాతలు వీటిని అందజేశారు. 2.5 కిలోల బంగారంతో రూపొందించిన శంఖు చక్రాల విలువ రూ.2.4 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.

# ఈ అందం వయసు లెక్కించడం అసాధ్యం

ఒకప్పుడు హీరోయిన్స్ మూడు పదుల వయసు దాటిన తర్వాత పెద్దగా కనిపించే వారు కాదు, నాలుగు పదుల వయసులో ఆంటీ పాత్రలు, అయిదు పదుల వయసులో అమ్మమ్మ పాత్రలు పోషించిన సందర్భాలు చాలానే ఉన్నాయి. కానీ ఈతరం హీరోయిన్స్ అలా కాదు. ప్రస్తుతం ఉన్న సీనియర్ స్టార్స్ హీరోయిన్స్ లో చాలా మంది అయిదు పదుల వయసులో ఉన్నప్పటికీ ఇండస్ట్రీలో బిజీగా హీరోయిన్ వేశాలు వేస్తున్నారు. హీరోయిన్ కాకున్నా కనీసం క్యారెక్టర్ ఆర్టిస్టుగా అయినా మంచి ఆఫర్లు దక్కించుకుంటున్నారు. సోషల్ మీడియాలో చాలా మంది సీనియర్ హీరోయిన్స్ అందం గురించి చర్చ జరుగుతూ ఉంటుంది. అందులో ప్రధానంగా టబు పేరు ఉంటుంది అనడంలో సందేహం లేదు. సీనియర్ హీరోయిన్ టబు అయిదు పదుల వయసులో పడి మూడు ఏళ్లు అవుతుంది. అయినా కూడా టబు ఫోటో షూట్స్ లో మూడు పదుల వయసు హీరోయిన్ మాదిరిగానే ఉంటుంది. ఈమె అందం ఏమాత్రం తగ్గడం లేదు అంటూ ప్రతి ఫోటోకు నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. టబు గురించి పెద్దగా తెలియని వారు, ఆమె పాత సినిమాలు చూడని వారిని ఆమె ఫోటోలు చూపించి వయసు ఎంత అంటే ఠక్కున చెప్పడం కష్టమే. ఎక్కువ శాతం మంది ముప్పై నుంచి నలబై మధ్య వయసు ఉంటుందేమో అని అంటారు. ఎక్కువ శాతం మంది మూడు పదుల వయసు లోపు ఉండే అవకాశం ఉందని అంటారు. అంతే కానీ



ఈమె అయిదు పదుల వయసు అని ఏ ఒక్కరూ ఖచ్చితంగా అనరు అనడంలో సందేహం లేదు. తాజాగా మరోసారి టబు సోషల్ మీడియాలో షేర్ చేసిన చీర కట్టు ఫోటోలు వైరల్ అవుతున్నాయి. టబు ఎంత అందంగా ఉంటుందో ఈ ఫోటోలు మరోసారి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తాయి అనడంలో సందేహం లేదు. అందమైన రూపంకు తగ్గట్లుగా అంతకు మించిన అందమైన చీర కట్టులో టబు మరింత అందంగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. టబు ఇంత అందంగా ఉండటం వల్లే ఇప్పటికీ హీరోయిన్స్ ఆఫర్లు వస్తున్నాయి. సీనియర్ హీరోలతో పోల్చితే ఈమె చాలా వయసులో చిన్న అన్నట్లుగా ఉంటుంది. హీరోలు ఐదు.. ఆరు పదుల వయసులోనూ టబుతో హీరోయిన్‌గా నటించేందుకు ఆసక్తి చూపిస్తూ ఉన్నారు. చాలా మంది సీనియర్ హీరోలతో ఈమె నటించింది. తాజా ఫోటోల్లో టబు అందమైన చిరు నవ్వు నెటిజన్స్‌ను అలాగే కట్టిపడేసి ఉంచుతుంది. చీర కట్టులో టబును గతంలో చాలా సార్లు చూశాం. కానీ ఈసారి అంతకు మించి అందం అన్నట్లుగా ఉంది అనడంలో సందేహం లేదు. ఆకట్టుకునే రూపంతో పాటు, మంచి చిరునవ్వు టబు సొంతం. అందుకే గత మూడు దశాబ్దాలుగా ఆమెను ప్రేక్షకులు అభిమానిస్తూ ఉన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అభిమానించే వారు కూడా చాలా మంది ఉన్నారు. ఈ అందమైన టబు మరిన్ని మంచి సినిమాలు చేయాలని, ఆకట్టుకునే విధంగా పాత్రలను ఎంపిక చేసుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. టబు గతంలో ఎన్నో సార్లు ప్రేమలో పడిందనే వార్తలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు టబు వైవాహిక జీవితంలో అడుగు పెట్టలేదనే విషయం తెల్సిందే.

## ప్రేమలు బ్యూటీ ఖాతాలో మరోటి..!

ప్రేమలు సినిమాతో సౌత్ ఆడియన్స్ మనసులు గెలిచేసింది క్యూట్ బ్యూటీ మమితా బైజు. ఆ సినిమాకు ముందు కూడా అమ్మడు మలయాళంలో సినిమాలు చేసినా కూడా ప్రేమలు సినిమానే ఎక్కువ ఇంపాక్ట్ చూపించింది. కేవలం మలయాళంలోనే కాదు ఆ సినిమా రిలీజైన ప్రతి చోటా అమ్మడికి ఫ్యాన్స్ ఏర్పడ్డారు. యూత్ ఆడియన్స్ అయితే మమితా నామ జపం చేస్తున్నారు. ముఖ్యంగా తెలుగు ఆడియన్స్ కి మమితా హోలిలిట్ ఫేవరెట్ అయ్యింది. టాలెంట్ ఉన్న వాళ్లకు తెలుగు ఆడియన్స్ హృదయాల్లో చోటిస్తారు. ఒక్కసారి తెలుగు ఆడియన్స్ కి దగ్గరైతే దూరమవడం చాలా కష్టం. ప్రేమలు లాంటి డబ్బింగ్ సినిమాతోనే మమిత తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. ఐతే యూత్ లో ఆమెకు ఉన్న బజ్ చూసి మన మేకర్స్ మమితా బైజుని ఇక్కడ సినిమాల్లోకి తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఐతే ఇప్పటికే తమిళ, మలయాళ సినిమాలతో బిజీగా ఉన్న మమితా తెలుగు దర్శక నిర్మాతల ఆఫర్లను కాదనేసింది. ఐతే సూర్య వెంకీ అట్లూరి చేస్తున్న సినిమాలో మాత్రం మమితా ఛాన్స్ అందుకుంది. అది తెలుగు, తమిళ్ బైలింగ్వల్ గా వస్తుంది కాబట్టి మమితా మొదటి తెలుగు సినిమా అదే అని ఫిక్స్ అవ్వొచ్చు. ఇదిలాఉంటే ఇలా సూర్య



సినిమా ఓకే చేసిందో లేదో మమితాకు మరో బంపర్ ఆఫర్ వచ్చిందని టాక్. స్టార్ సినిమాలో ఆమెకు అవకాశం దక్కిందట. డేట్స్ అడ్జెస్ట్ చేసుకుని అయినా సినిమాలు చేయాలి కానీ రిజెక్ట్ చేస్తూ పోతే తర్వాత కావాలన్నప్పుడు అవకాశాలు దొరకవని మమితా కి తెలిసి వచ్చింది. అందుకే సూర్య సినిమా ఇలా ముహూర్తం పెట్టగానే మరో తెలుగు సినిమా ఆఫర్ రాగా అది కూడా ఓకే చేసింది. ఇప్పటికే అమ్మడు మైత్రి మేకర్స్ ప్రదీప్ రంగనాథన్ తో చేస్తున్న డ్యూడ్ సినిమాలో ఛాన్స్ అందుకోగా ముచ్చటగా మూడో ఆఫర్ కూడా కొట్టేసిందని తెలుస్తుంది. మొత్తానికి మమితా బైజు మీద ఉన్న క్రేజ్ ని క్యాష్ చేసుకునేందుకు తెలుగు మేకర్స్ ప్రయత్నిస్తున్నారు. డ్యూడ్ తో పాటు సూర్య సినిమా రిలీజ్ అయ్యే సరికి మమితా ఇక్కడ టాప్ రేంజ్ కి వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని చెప్పొచ్చు. ఆల్రెడీ త్వరలో ప్రేమలు 2 తో మరోసారి ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైన మమితా ఈ సినిమాలన్నీ కూడా ఆమె ఫ్యాన్స్ కి ఫుల్ జోష్ తెప్పించడం గ్యారెంటీ అని చెప్పొచ్చు.




# అక్కడ ‘కూలీ’ ముందు తేలిపోతున్న వార్-2





ఈ ఇండిపెండెన్స్ డే వీకెండ్లో ఇండియన్ బాక్సాఫీస్‌లో మెగా క్లాష్ చూడబోతున్నాం. తమిళం నుంచి ‘కూలీ’, హిందీ నుంచి ‘వార్–2’ భారీ అంచనాల మధ్య విడుదల కాబోతున్నాయి. వీటి క్రేజ్ ఒక భాషకు పరిమితం కాదు. పాన్ ఇండియా స్థాయిలో ఇవి సందడి చేయబోతున్నాయి. ఐతే కాంబినేషన్ క్రేజ్, ఎగ్జైటింగ్ ప్రోమోలతో ‘కూలీ’నే హైప్ పరంగా ముందంజలో ఉన్నట్లు కనిపిస్తోంది. ఇండియాలో బుకింగ్స్ మొదలు కావడానికి ఇంకా చాలా టైం ఉంది కానీ.. ఈలోపు యుఎస్‌లో ఈ రెండు చిత్రాలకూ టికెట్ల అమ్మకాలు మొదలయ్యాయి. అక్కడ ‘కూలీ’ దూకుడు ముందు ‘వార్–2’ అస్సలు నిలిచేలా కనిపించడం లేదు. విడుదలకు మూడు వారాల సమయం ఉండగానే ‘కూలీ’ యుఎస్‌లో హాఫ్ మిలియన్ క్లబ్బులోకి అడుగు పెట్టేయడం విశేషం. ఈ సినిమాకు బుకింగ్స్ మొదలైనప్పటి నుంచి టికెట్లు శరవేగంగా అమ్ముడవుతున్నాయి.

అప్పుడే హాఫ్ మిలియన్ అంటే.. ప్రిమియర్స్‌తోనే సినిమా మిలియన్ డాలర్లు కొల్లగొట్టడం లాంఛనమే. సినిమా అంచనాలకు తగ్గట్లు ఉంటే వీకెండ్లోనే మూణ్నాలుగు మిలియన్ డాలర్లు వసూలు చేయడం పక్కా. ఐతే ‘వార్–2’కు మాత్రం యుఎస్‌లో ప్రస్తుతానికి అంత డిమాండ్ కనిపించడం లేదు. పరిమిత లొకేషన్లలోనే టికెట్ల అమ్మకాలు మొదలు కాగా.. టికెట్లు నెమ్మదిగా తెగుతున్నాయి. అమ్మకాలు 5 వేల డాలర్లకు చేరువగా ఉన్నాయంతే. ఐతే పూర్తి స్థాయిలో బుకింగ్స్ మొదలైతే ప్రి సేల్స్ ఎలా ఉంటాయో చూడాలి. ప్రస్తుతానికి అయితే సినిమాకు డిమాండ్ తక్కువగానే కనిపిస్తోంది.

# 2025-26 లో వచ్చే పాన్ ఇండియా సినిమాలివేనా!



2025–26 క్యాలెండర్ ఇయర్ లో రిలీజ్ అయ్యే టాలీవుడ్ పాన్ ఇండియా సినిమాలెన్ని? అంటే ప్రముఖంగా కొన్ని చిత్రాలు కనిపిస్తున్నాయి. ఇవి మాత్రం కచ్చితంగా రిలీజ్ అయ్యే చిత్రాలని చెప్పొచ్చు. ఇప్పటికే బాగా ఆలస్యమైన నేపథ్యంలో వీలైనంత త్వరగా రిలీజ్ చేయాలని మేకర్స్ తపిస్తున్నారు. ఓ సారి ఆ చిత్రాల వివరాల్లోకి వెళ్తే... ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తోన్న ‘రాజాసాబ్’ ఎంత కాలంగా వాయిదా పడు తుందో తెలిసిందే. ఏప్రిల్ రిలీజ్ అనుకున్నారు. కానీ సాధ్య పడలేదు. తాజాగా చిత్రం దసరా రిలీజ్ రేస్ లో కనిపిస్తుంది. సినిమా రిలీజ్ కోసం అభిమానులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. ప్రభాస్ మరో చిత్రం ‘ఫౌజీ’ కూడా వేగంగా షూటింగ్ పూర్తి చేసుకుంటుంది.

ఈ చిత్రాన్ని కూడా ఏడాది ముగింపులో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఒకవేళ ఈ ఏడాది సాధ్యం కానీ పక్షంలో వచ్చే ఏడాది ఆరంభంలోనే రెండు చిత్రాలు రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతోన్న ‘పెద్ది’ రిలీజ్ తేది ప్రకటించిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది మార్చి 27న రిలీజ్ చేస్తున్నారు. యంగ్ హీరో తేజ సజ్జా నటిస్తోన్న ‘మిరాయ్’ ఇదే ఏడాది ఆగస్టులో రిలీజ్ సన్నాహాలు చేస్తున్నారు. అప్పటికి అన్ని పనులు పూర్తయితే రిలీజ్ అవుతుంది. లేదంటే? ఏడాది ముగింపు కల్లా ప్రేక్షకుల ముందుకొస్తుంది. మరో వాయిదా ఛాన్స్ తీసుకునే అవకాశమైతే లేదు. పవన్ కళ్యాణ్ నటిస్తోన్న మరో చిత్రం ‘ఓజీ’ కూడా ఏడాది ముగింపులో గానీ వచ్చే ఏడాది గానీ రిలీజ్ అవుతుంది. ఇప్పటికే చిత్రీకరణ ముగింపు దశలో ఉంది.

నటసింహ బాలకృష్ణ నటిస్తోన్న ‘అఖండ2’ పాన్ ఇండియా లో భారీ అంచనాల మధ్య సెప్టెంబర్ లో రిలీజ్ అవుతుంది. ఆ తేదీ మిస్ అయితే అక్టోబర్ రిలీజ్ తప్పనిసరి. యంగ్ టైగర్ ఎన్టీర్ బాలీవుడ్ డెబ్యూ ‘వార్ 2’ భారీ అంచనాల మధ్య ఆగస్టులో రిలీజ్ అవుతుంది.

తెలుగు సినిమా కాకపోయినా తారక్ ఎంట్రీతో ‘వార్ 2’ టాలీవుడ్ చిత్రంగా మారిపోయింది. సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తోన్న ‘కూలీ’ ఆగస్టులో రిలీజ్ అవుతుంది. కన్నడ స్టార్స్ యశ్ నటిస్తోన్న ‘టాక్సిక్’ వచ్చే ఏడాది మార్చిలో ప్రేక్షకుల ముందుకొస్తుంది. రిషబ్ శెట్టి స్వీయా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న కాంతార చాప్టర్ 1 అక్టోబర్ లో రిలీజ్ అవుతున్నాయి.

# కలర్ఫుల్ గౌనులో నభా మ్యాజికల్ లుక్!

టాలీవుడ్ బ్యూటీ నభా నటేశ్ ఫ్యాషన్ గేమ్ రోజురోజుకీ మరింత ఎలివేట్ అవుతోంది. తాజాగా ఆమె బ్లూ గౌన్‌లో ఓ డ్రీమీలుక్‌కి ప్రాణం పోస్తూ చేసిన ఫొటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియా లో వైరల్ అవుతోంది. తేలికపాటి మెరుపులు, మెల్లని కాటన్ మేఘాలా లాంటి గౌన్‌లో ఆమె వేసిన ఆ స్టెప్పులు అన్నీ ఓ కవితలా కనిపిస్తున్నాయి. ఒక డాన్స్ మూవ్‌లో ఆమె గౌన్ అలజడితో, చుట్టూ రొమాన్స్ మాయను అల్లేస్తోంది. ఈ ఫొటోషూట్‌కు నేపథ్యంగా ఎలాంటి హెవీ బ్యాక్‌డ్రాప్ లేకుండానే, కేవలం నభా తన గ్లామర్ తో హైలెట్ చేసింది. ఆమె వేషధారణలో సింప్లిసిటీ కనిపించినా, హావభావాల్లో క్లాస్ ఓవర్‌ఫ్లో అయ్యింది. బ్లూ కలర్ ఆమెకు ఎంతో బాగా మ్యాచ్ అయి నేచురల్‌గా వెలిగిపోనిచ్చింది. అందులోనూ లైట్ మేకప్, కర్లీ హెయిర్, మెల్లగా చిరునవ్వుతో ఆమె దర్శనం చూసి ఫ్యాన్స్ “ఏంజెల్”



అనే ట్యాగ్‌లు పెడుతున్నారు. కెరీర్ పరంగా చూసుకుంటే, నభా నటేశ్ ‘నన్ను దోచుకుందువటే’ సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి, ‘ఇస్మార్ట్ శంకర్’తో ఓవర్నైట్ స్టార్ అయింది. ఆ తరవాత ఆమె చేసిన కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో కలెక్షన్స్ రాబట్టకపోయినా, ఆమెపై ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్ మాత్రం తగ్గలేదు. మళ్లీ ‘స్వయంభు’ అనే పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌లో నిఖిల్ సరసన నటిస్తూ కెరీర్‌ను తిరిగి పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతోంది. ఇదిలా ఉంటే నభా నటేశ్ ఇప్పుడు ఫ్యాషన్ లెవెల్‌ను మరో మెట్టుకు తీసుకెళ్తోంది. ప్రతి ఫొటోషూట్ ద్వారా కొత్త ఎటిట్యూడ్‌ను, కొత్త మూడ్‌ను చూపించే ప్రయత్నం చేస్తోంది. ఈ గౌన్ ఫొటోలు చూసిన వారంతా “ఇది సినిమాటిక్ లెవెల్” అని కామెంట్లు చేస్తున్నారు. ఆమె స్టైల్, గౌన్ మూమెంట్స్, ఎక్స్‌ప్రెషన్స్ అన్నీ కలిసొచ్చి ఒక కళాత్మక ప్రదర్శనలా నిలిచాయి. మొత్తానికి నభా ఈ కొత్త లుక్‌తో మరోసారి తన అందం, స్టైల్, ల్ ఎలా ఉంటాయో చూపించింది.

# 50 వయసులో దడ పుట్టిస్తున్న సుష్!

1994లో మిస్ యూనివర్స్ కిరీటాన్ని గెలుచుకున్న సుష్మితా సేన్ ఆ తర్వాత నటనలోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కింగ్ నాగార్జున సరసన రక్షకుడు (1996) చిత్రంలోకథానాయికగా నటించింది. అదే ఏడాదిలో దస్తక్‌తో హిందీ సినిమాల్లోకి ప్రవేశించింది. బివి నంబర్ 1, ఫిల్హాల్, మై హూ నా వంటి చిత్రాలలో తన బలమైన పాత్రలతో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకుంది. అందాల రాణిగా కిరీటం అందుకున్న సిస్మితాసేన్ బహుముఖ ప్రజ్ఞావంతురాలు. అయితే సుస్మితాసేన్ ప్రతిసారీ ఎఫైర్ మ్యాటర్స్ తో మీడియా హెడ్ లైన్స్ లోకి వచ్చింది. ప్రేమాయణాలు, బ్రేకప్ లు సుష్ కి కొత్తేమీ కాదు. లైఫ్ లో పెళ్లి మ్యాటర్ ఎత్తకుండా డేటింగులతో టైమ్ స్పెండ్ చేసిన సుస్మితాసేన్ చివరిగా మోడల్ రోహ్మాన్ షాల్ తో డేటింగ్ చేసింది. ఆ తర్వాత బిజినెస్ మేన్, ఐపీఎల్ ఫౌండర్ లలిత్ మోడీతో డేటింగులో ఉన్నానని ప్రకటించినా కానీ, ఇంతలోనే అది బ్రేకప్ అయింది. ఇటీవల జియో హాట్‌స్టార్‌లో ప్రసారం అవుతున్న %బు% సిరీస్ ఆర్యతో



సుష్ నటిగా తిరిగి వచ్చింది. తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి ప్రమాదకరమైన నేరాల ప్రపంచాన్ని ఢీకొట్టే తల్లిగా తన పాత్ర విమర్శకుల ప్రశంసలను పొందింది. ఆర్యతో నటనలోకి రీఎంట్రీ అదరగొట్టేయడమే కాకుండా ప్రతిష్ఠాత్మక ఎమ్మీ అవార్డులలో నామినేషన్ సహా అంతర్జాతీయ గుర్తింపును కూడా పొందింది. సుస్మితాసేన్ ఎప్పటికీ స్టైల్ ఐకాన్‌గా అభిమానుల హృదయాల్లో నిలిచి ఉంది. ఏదైనా రెడ్ కార్పెట్ ఈవెంట్ అయినా, పబ్లిక్ ఈవెంట్ అయినా సుస్మితాసేన్ లుక్ గురించి చర్చ సాగుతుంది. తాజాగా సుస్మిత బ్లాక్ కలర్ డిజైనర్ శారీలో ప్రత్యక్షమైంది. ఈ డిజైనర్ లుక్ యువతరం గుండెల్లో గుబులు రేపింది. అయితే సుస్మితాసేన్ వయసు 50. ఈ వయసులోను 20 మైనస్ అమ్మాయిలా కనిపిస్తూ సుష్ గుబులు పెంచుతోంది. ప్రస్తుతం ఈ బ్లాక్ శారీ లుక్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది.




# సుప్రీంకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

దిల్లీ: భూ వివాదం వ్యవహారంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కి మరోసారి ఊరట లభించింది. సొసైటీ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని 2016లో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మయ్య పై పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పీఎస్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తనపై కేసును కొట్టివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఫిర్యాదు దారు ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది.

రేవంత్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పు అనంతరం.. కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ పెద్దిరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం డిస్మిస్ చేసింది.

**పిటిషనర్, న్యాయవాదిపై సుప్రీంకోర్టు ఆగ్రహం...** పిటిషన్‌లో.. ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. ఒక న్యాయవాదిగా న్యాయమూర్తిపై వ్యాఖ్యలు చేస్తూ .. పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్. పెద్దిరాజుతోపాటు ఆయన తరఫు న్యాయవాది రితేష్ పాటిల్‌కు ధర్మాసనం కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు పిటిషనర్ పెద్దిరాజు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలిచ్చింది. కోర్టు సాక్షిగా పిటిషనర్ తరఫు న్యాయవాది రితీష్ పాటిల్ క్షమాపణ కోరారు. అందుకు నిరాకరించిన సీజేఐ.. పిటిషన్ రాసేటప్పుడు, దాఖలు చేసేటప్పుడు గుడ్డిగా ఎలా వేశారని ప్రశ్నించారు. పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అనుమతివ్వాలని న్యాయవాది రితీష్ పాటిల్ కోరగా.. అందుకు సీజేఐ నిరాకరించారు. పిటిషన్ దాఖలు చేసే ముందు న్యాయవాదిగా అన్ని విషయాలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోవద్దంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. కోర్టు ధిక్కరణ నోటీసుపై లిఖిత పూర్వకంగా సమాధానం ఆదేశించారు. సమాధానం ఆమోదయోగ్యంగా ఉంటేనే కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టం చేస్తూ... విచారణ ఆగస్టు 11కు వాయిదా వేశారు.




డేటింగ్ యాప్ 'టీ' లీకుల తుపాన్‌లో చిక్కుకుంది. మహిళలు తమకు నచ్చిన విషయాలు షేర్ చేసుకునేలా రూపొందించిన ఈ వేదికలో గోప్యతా ఉల్లంఘనలు బయటపడ్డాయి. 11 లక్షల మంది యూజర్ల మధ్య జరిగిన ప్రైవేటు మెసేజ్‌లు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయ్యాయని ఓ మీడియా కథనం పేర్కొంది. వాటిలో అత్యంత సున్నితమైన, వ్యక్తిగత సమాచారం ఉందని వెల్లడించింది. తమ యాప్ మహిళలకు సేఫ్ స్పేస్ అని 'టీ' నిర్వాహకులు చెప్తున్నప్పటికీ.. వరుసగా డేటా బయటకు పొక్కుతోంది. కొన్ని రోజుల క్రితం వేలాది యూజర్ల సెల్ఫీలు, ఐడీ ఫొటోలు ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టాయి. ఈవిషయాన్ని సైబర్ సెక్యూరిటీ నిపుణుడు ఒకరు మీడియాకు వెల్లడించారు. తాజా ఉల్లంఘనల్లో 2023 నుంచి ఉన్న సందేశాలు కూడా ఉన్నాయని ఆ కథనం పేర్కొంది. అందులో కొందరు మహిళలు అబార్షన్, రిలేషన్‌షిప్ సమస్యలను చర్చించుకున్నారు. ఈ యాప్‌లో నకిలీ పేర్లు వాడే వెసులుబాటు ఉన్నప్పటికీ.. చాలామంది యూజర్లు తమ గుర్తింపు తెలియజేసే వివరాలను ఉపయోగించారు. తమ ప్రైవేటు సంభాషణలు గోప్యంగా ఉంటాయని వారు భావించినప్పటికీ.. ఇలా బయటకు పొక్కడం తీవ్ర ఆందోళనలకు దారితీసింది. దీంతో ఈ యాప్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈ టీ యాప్‌నకు 16 లక్షల మంది యూజర్లు ఉన్నారు. మహిళలు మాత్రమే ఈ యాప్‌లో చేరేలా వారి సెల్ఫీలతో నిర్ధరణ చేసుకుంటారు. ఈ ఫీచర్ వల్లే మహిళలు దీనిపై ఆకర్షితులయ్యారు. కానీ వరుసగా జరిగిన ఈ ఉల్లంఘనల వల్ల యూజర్ల సమాచారాన్ని భద్రపరిచే సామర్థ్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారాలపై టీ నిర్వాహకులు స్పందించారు. "ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలను ఇప్పటికే ప్రారంభించాం. అలాగే సైబర్ సెక్యూరిటీ నిపుణులతో విచారణ చేయిస్తున్నాం. అలాగే భద్రతా సంస్థలు జరిపే దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నాం" అని వెల్లడించారు.




ఆపరేషన్ సిందూర్‌పై మంగళవారం లోక్‌సభలో చర్చ జరగనుంది. ఈ చర్చల్లో కాంగ్రెస్ నేతలు శశిథరూర్, మనీశ్ తివారీలను పార్టీ దూరం పెట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తివారీ ఓ క్రిప్టిక్ పోస్టు (నర్మగర్భ వ్యాఖ్యలు) పెట్టారు. అందులో తాను భారత్ వైపే మాట్లాడతానని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి ప్రపంచదేశాలకు వివరించడానికి వెళ్లిన అఖిలపక్ష బృందంలో థరూర్, తివారీ ఉన్నారు. ఈ ఆపరేషన్‌పై జరిగే చర్చలో తమను ఎందుకు దూరం పెట్టారనే దానిపై ఓ వార్తా సంస్థ రాసిన కథనాన్ని తివారీ ఎక్స్‌లో పంచుకున్నారు. దానికి పూరబ్ ఔర్ పశ్చిమ్ అనే బాలీవుడ్ సినిమాలోని దేశభక్తి గీతంలో కొన్ని వ్యాఖ్యలను జోడించారు.


ఒక భారతీయుడిగా తాను దేశ వైభవాన్నే కోరుకుంటాననేది దాని అర్థం. దీనికి ముందు చర్చల్లో తాను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని తివారీ పార్టీకి అభ్యర్థన కూడా పంపారని పార్టీ వర్గాలు ఓ వార్తా సంస్థకు తెలిపాయి. ఇక, ఆపరేషన్‌పై జరిగే చర్చల్లో థరూర్ ఉండాలని కాంగ్రెస్ కోరిందని.. అయితే, పార్టీ చెప్పినవిధంగా మాట్లాడాలని కోరినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కానీ, దీనికి ఆయన నిరాకరించినట్లు సమాచారం. దీనిపై విలేకరులు ప్రశ్నించగా.. మౌనవ్రతం, మౌనవ్రతం అంటూ థరూర్ బదులిచ్చారు.




హైదరాబాద్: బీసీ బిల్లు ఎంత అవసరమో దేశానికి చాటి చెప్పేందుకు ఆగస్టు 4, 5, 6 తేదీల్లో 72 గంటల దీక్ష చేయనున్నట్టు తెలంగాణ జాగృతి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కవిత అన్నారు.

హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. బీసీ బిల్లు సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు దీక్ష చేయనున్నట్టు చెప్పారు. బీసీ బిల్లు సాధన విషయంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. అన్ని పార్టీలతో వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి దిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ దిల్లీలో తలపెట్టిన ధర్నా కేవలం బిహార్ ఎన్నికలను దృష్టి పెట్టుకుని చేస్తున్న డ్రామా అని విమర్శించారు. బీసీ బిల్లు విషయంలో చేయాల్సిన పని చేయకుండా కాంగ్రెస్ పార్టీ సాగదీత ధోరణి అవలంభిస్తోందని మండిపడ్డారు. భాజపా నేతలు బీసీలకు అండగా ఉండాల్సిన సమయంలో తప్పించుకొని తిరుగుతున్నారని విమర్శించారు.

## సికింద్రాబాద్‌లోని ఇండియన్ స్పెర్మ్ టెక్‌లో పోలీసుల తనిఖీలు



హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని ఇండియన్ స్పెర్మ్ టెక్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. క్లూస్ టీమ్ సహాయంతో గోపాలపురం పోలీసులు ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. పలువురి నుంచి సేకరించిన వీర్యకణాలకు సంబంధించిన మూడు డబ్బాలు, ఆధార్ కార్డులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

నిర్వాహకుడిగా ఉన్న పంకజ్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఇటీవల సృష్టి టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్ అక్రమాలు బయటపడిన నేపథ్యంలో ఇండియన్ స్మెర్మ్ టెక్‌లో రోజువారీ కూలీలు, యాచకులు, పాదచారులకు కమీషన్ ఇచ్చి వీర్య కణాలు, అండాలను సేకరిస్తున్నారన్న సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు.




హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఉందని వివరించారు. పలువురు నేతలు జూబ్లీహిల్స్ నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇస్తే వారే పోటీ చేస్తారని తెలిపారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థిపై సర్వే జరుగుతోందని వెల్లడించారు. అభ్యర్థులు ఎవరున్నా.. అందరూ కలిసి పనిచేస్తారని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో ఈసారి కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.




**మహాదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లిలో విషాదం చోటు చేసుకొంది. ఓ ప్రైవేటు పాఠశాల బస్సు కింద పడి మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. అంబటిపల్లికి చెందిన సింగనేని మల్లేశ్, భాగ్య దంపతుల కుమారుడు అనివిత్‌ను పాఠశాల బస్సు ఎక్కించడానికి కుమార్తెతో కలిసి తల్లి వచ్చింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బస్సు కింద కుమార్తె శ్రీహర్షిణి (3) పడి అక్కడిక్కడే మృత్యువాత పడింది. మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.**

# సుక్మా జిల్లాలో ఎదురు కాల్పులు



చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో పోలీసులు, మావోయిస్టుల మధ్య మంగళవారం ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఓ వైపు మావోయిస్టులు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తుండగా ఎదురు కాల్పులు చోటుచేసుకోవడం గమనార్హం. డీఆర్‌జీ, సీఆర్పీఎఫ్, ఎస్‌టీఎఫ్ బృందాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. మావోయిస్టులను బలగాలు చుట్టుముట్టాయి. ఉదయం నుంచి కాల్పులు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టులు.. అమరవీరుల వారోత్సవాలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బస్తర్‌లోని పోలీసు బలగాలు అప్రమత్తంగా ఉన్నాయి.




**అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 25 నుంచి 31 వరకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. అక్రమాలకు ఆస్కారం లేకుండా క్యూఆర్ కోడ్‌తో ఈ కార్డులను రూపొందించినట్లు తెలిపారు. మంగళవారం మీడియాతో మంత్రి మాట్లాడారు. "కొత్తగా 9లక్షల మందికిపైగా రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నాం. రాష్ట్రంలోని 29,796 రేషన్ షాపుల్లో ప్రతినెలా 1 నుంచి 15 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 వరకు రేషన్ సరఫరా చేస్తున్నాం. ఐదేళ్లలోపు, 80 ఏళ్లు దాటిన వారికి ఈకేవైసీ అక్కర్లేదు"అని మంత్రి నాదెండ్ల తెలిపారు.**

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com